


రైలు సొరంగం గుండా వెళ్ళిన ప్పు డు, చీకటి పడినప్పటికీ మీరు టికె ట్ విసిరి దూకరు, మీరు ఇప్పటికీ కూర్చుని ఇంజనీర్‌ను నమ్ముతారు సరియైనదా, మీరు ఏదైనా పరిస్థి తిలో పడేలా చేస్తే, పూర్తిగా నమ్మం డి, రెండు విషయాలు జరగవచ్చు, మీరు పడిపోయినప్పుడు దైవిక శ క్తి మిమ్మల్ని పట్టుకుంటుంది లేదా అది మీకు ఎగరడం నేర్పుతుంది ..మీరు ఉన్నత లక్ష్యం కోసం ఇక్కడ ఉన్నారు ..పెద్దగా ఆలోచించండి ..మీ మూలాలను లోతుగా చేసుకోం డి మరియు మీ దృష్టిని విస్తృతం చేసుకోండి, కొన్నిసార్లు మీరు ఏదై నా పెద్ద ప్రాజెక్ట్ లేదా పెద్ద పనిని చే పట్టేటప్పుడు, మీకు సవాలు ఎదు రవుతుంది, పర్వాలేదు, సవాళ్లను మీ ఎదుగుదలకు అవకాశంగా తీ సుకోండి.నేను మీకు చెప్తున్నాను, మీరు ప్రకాశవంతమైన రంగురం గుల రెక్కలు కలిగిన స్వేచ్ఛా పక్షి లాంటివారు.. మీరు కొంచెం క్రిందికి దిగవచ్చు కానీ మీకు ఇంకా రెక్కలు ఉన్నాయి. మీలోని అన్ని అందమై న రంగులను ప్రపంచానికి అన్వేషిం చండి, జీవితంలోని అన్ని కోణాల లో పూర్తిగా వికసించండి, సమా జానికి ఏదైనా చేయండి, మీ చు ట్టూ ఉన్న ప్రజలకు ఉపయోగకరం గా ఉండండి.

- గురు దేవ్ శ్రీ శ్రీ రవి శంకర్


# ప్రజా దీవెన

సమ సమాజ సంక్షేమం మా సంకల్పం...

నల్లగొండ | సంపుటి : 10 | సంచిక : 175 | మంగళవారం | 22 ఏప్రిల్ 2025 | పేజీలు : 04 వెల ₹5


## ప్రజాసంక్షేమం పరమావధి

ప్రజల జీవితాలు ప్రభావితం చేసేలా చర్యలు..

సివిల్ సర్వీసెస్ డేలో ప్రధాని మోడీ



04

## అంబేద్కర్ అందరివాడు



03

- కొందరికే పరిమితం చేయడం తగదు
- కేంద్రమంత్రి బండి సంజయ్ వెల్లడి





# అవకాశాల ఆశలు



- ఒసాకాలో జరిగిన వరల్డ్ ఎక్స్ పోలో సీఎం రేవంత్ రెడ్డి

**ప్రజా దీవెన, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి జపాన్ వేదికగా ప్రపంచానికి చాటి చెప్పారు. ఒసాకాలో జరిగిన వరల్డ్ ఎక్స్ పోలో తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం పాలుపంచుకుంది. వివిధ రంగాలకు చెందిన వ్యాపార వేత్తలు, పారిశ్రామిక వేత్తలతో విడివిడిగా సమావేశమైంది. వివిధ రంగాల్లో రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అపారమైన అవకాశాలను వారితో చర్చించింది.

## తెలంగాణ తెచ్చుకుందే జాబ్స్ కోసం

- గతంలో కొందరి ప్రయోజనాలే నెరవేరాయి
- మధిరలో మెగా జాబ్ మేళాలో భట్టి

**ప్రజా దీవెన, ఖమ్మం :** తెలంగాణ తెచ్చుకున్నదే ఉద్యోగాల కోసం అని, తెలంగాణ తెచ్చుకున్నాక ఓ కుటుంబానికి మాత్రమే ఉద్యోగాలు వచ్చాయని డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రజా పాలనలో నిరుద్యోగులందరికీ పారదర్శకంగా ఉద్యోగాలు ఇస్తున్నామన్నారు. బీఆర్ఎస్ హయాంలో పేపర్ లీకేజీలతో సమయం అయిపోయిందని, కాంగ్రెస్ హయాంలో నిరుద్యోగులకు పారదర్శకంగా ఉద్యోగాలు కల్పిస్తున్నామన్నారు. ఖమ్మం

మిగతా 2 లో





02

## నేడే 'ఇంటర్' విడుదల

- 12 గంటలకు విడుదల

## భారీ ఎన్‌కౌంటర్

- 8మంది మావోయిస్టుల మృతి
- మృతుల్లో.. అగ్రనేత, రూ.కోటి రివార్డ్ మావోయిస్టు ప్రయాగ్ మాంఝీ!

02





## పసుపుబోర్డు ఘనత మాదే

పసుపు బోర్డు తెచ్చిన ఘనత తమదేనని, దానికోసం తాను పోరాటం చేశానని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. బోర్డు ఏర్పాటు చేశారు కానీ ఇంకా పనులు ఎందుకు ప్రారంభించలేదని కేందరాన్ని ఆయన ప్రశ్నించారు.

- బోర్డు పనులు ప్రారంభించని కేంద్రం
- కాళేశ్వరంతో రాష్ట్రం దివాళా
- ప్రాణహిత చేవెళ్ల చేపట్టివుంటే నిజామాబాద్‌కు నీరందేది
- నిజామాబాద్ సభలో మంత్రిఉత్తమ్
- పామాయిల్ సాగుతో మంచి లాభాలన్న మంత్రి తుమ్మల



06

## అప్పులపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విపరీత అబద్దాలు

ఖమ్మం జిల్లా నుంచి ముగ్గురు మంత్రులున్నా నిరుపయోగం

తెలంగాణను కాపాడే బాధ్యత బీఆర్ఎస్ పార్టీదే

కేసీఆర్ కి, పార్టీ కార్యకర్తలకు మధ్య వారిధిగా ఉంటాను

పార్టీ సమావేశంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

## రోహిత్ వేముల' చట్టాన్ని తీసుకరండి

- అంబేద్కర్, రోహిత్ ఎదుర్కొన్న వివక్ష మరెవరూ ఎదుర్కోకూడదు
- రేవంత్ రెడ్డికి రాహుల్ గాంధీ లేఖ



02

# పోప్ ఫ్రాన్సిస్ కన్నుమూత



- ఇటీవలే ఆస్పత్రి నుంచి విడుదల
- సంతాపం తెలిపిన ప్రపంచనేతలు
- ప్రధాని మోడీ, తెలుగు రాష్ట్రాల సీఎంల సంతాపం

కేథలిక్‌ల అత్యున్నత మత గురువు పోప్ ఫ్రాన్సిస్ (88) ఇటలీ కాలమానం ప్రకారం సోమవారం ఉదయం 7.35కు కన్నుమూశారు. ఆయన గత కొంతకాలంగా శ్వాసకోశ సమస్యలు, డబుల్ న్యూమోనియా, కిడ్నీ సమస్యలతో తీవ్రంగా బాధపడ్డారు. ఫిబ్రవరి 14 నుంచి ఆయన 38 రోజుల పాటు ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం గత నెల డిశ్చార్జి అయ్యారు. ఆయన మృతి విషయాన్ని వాటి కన్ వర్గాలు ధ్రువీకరించాయి. 2013లో పోప్ బెనిడెక్ట్ తర్వాత ఫ్రాన్సిస్ ఈ బాధ్యతలు చేపట్టారు. ప్రపంచ శాంతి స్థాపకుడిగా పోప్ ఫ్రాన్సిస్ పాత్ర అద్భుతం అని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. పోప్ ఫ్రాన్సిస్ మృతి నన్ను ఎంతో బాధించింది. ఆధ్యాత్మిక నాయకుడిగా కోట్ల మందిలో స్ఫూర్తి నింపారు. శాంతి సందేశంగా నిలిచారు. ఆంధ్రప్రదేశ్ ప్రజల తరఫున ప్రపంచ క్యాథలిక్ కమ్యూనిటీకి ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నానని ఏపీ సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

మిగతా 4 లో





# భారీ ఎన్‌కౌంటర్

**ప్రజా దీవెన, రాంచీ :** జార్ఖండ్‌లోని బొకారో జిల్లాలో మావోయిస్టులు, భద్రతాబలగాలకు మధ్య ఎదురుకాల్పుల్లో 8మంది మృతిచెందారు. ఈ ఎన్‌కౌంటర్‌లో ఎనిమిది మంది మావోయిస్టులు మృతిచెందారు. సోమవారం తెల్లవారుజామున బొకారో జిల్లాలోని లాల్‌పానియా ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నరన్న సమాచారంతో సీఆర్‌పీఎఫ్‌కు చెందిన 209 కమాండో బెటాలియన్ ఫర్ రిసొల్యూట్ యాక్షన్ (కోబ్రా) దళాలు, స్థానిక పోలీసులు సంయుక్తంగా కూంబింగ్ చేపట్టారు. ఈ క్రమంలో ఉదయం 5.30 గంటల సమయంలో లుగు కొండల ప్రాంతంలో భద్రతా బలగాలకు మావోయిస్టులు ఎదురుపడ్డారు. దీంతో ఇరు పక్షాల మధ్య కాల్పులు జరిగాయి. పోలీసుల కాల్పుల్లో 8 మంది మావోయిస్టులు చనిపోయారని సీఆర్‌పీఎఫ్ అధికారులు వెల్లడించారు. మృతులను గుర్తించాల్సి ఉందని తెలిపారు. ఘటనా స్థలంలో ఎస్ఎల్ఆర్, ఇన్సాస్ రైఫిళ్లతోపాటు- భారీగా ఆయుధాలు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఆ ప్రాంతంలో కాల్పులు ఇంకా కొనసాగుతున్నాయని వెల్లడించారు. కాగా, ఈ నెల 14న జార్ఖండ్‌లోని పశ్చిమ సింఘ్‌భమ్ జిల్లాలో 11 మావోయిస్టు బంకర్లను భద్రతా బలగాలు ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. సీఆర్‌పీఎఫ్, స్థానిక పోలీసులు కూంబింగ్ నిర్వహిస్తుండగా బాక్రబేదా అటవీ ప్రాంతంలో రెండు ఐఈడీలను గుర్తించారు. వాటిని బాంబు స్క్వాడ్ సిబ్బంది నిర్వీర్యం చేసిన విషయం తెలిసిందే.

# అసలును పోలిన నకిలీ నోట్లు

## అప్రమత్తం చేసిన కేంద్ర హోంశాఖ

**ప్రజా దీవెన, న్యూఢిల్లీ :** దేశంలో దొంగనోట్ల చెలామణి కలకలం రేపుతోంది. దొంగనోట్ల తయారీ దారులు అత్యంత పకడబ్బందీగా ముద్రణ చేస్తున్నట్లు తెలుస్తోంది. నోట్ల రద్దు తరవాత వాటిని చాలవరకు కంట్రోల్ చేసినా, అడపాదడపా పట్టుబడుతూనే ఉన్నాయి. తాజాగా అత్యాధునిక టెక్నాలజీ వాడి తయారుచేసిన రూ.500 దొంగనోట్లు చెలామ- ణిలోకి వచ్చినట్లు కేంద్ర హోంశాఖ హెచ్చరికలు జారీ చేయడం మరింత కలకలం రేపింది. ప్రజలు వీటి విషయంలో అప్రమత్తంగా ఉండాలని పేర్కొంది. ఈ సమాచారాన్ని డీఆర్ఐ, ఎఫ్ఐయూ, సీబీఐ, ఎన్ఐఏ, సెబీతో కూడా పంచుకొంది. ఆ దొంగనోట్ల ప్రింటింగ్, నాణ్యత చాలావరకు అసలు నోట్లులాగే ఉన్నట్లు వెల్లడించింది. వాటిని గుర్తించడం కూడా చాలా క్లిష్టంగా మారిందని వెల్లడించింది. ఈ చిన్న తప్పును గుర్తించాలంటే ఆ నోటును క్షుణ్ణంగా పరీక్షించాల్సి ఉంటుందని పేర్కొంది. ఇలాంటి నకిలీ నోట్లు అత్యంత ప్రమాదకరమని వెల్లడించింది. వీటి విషయంలో ఆర్థిక సంస్థలు, బ్యాంకులు, ఏజెన్సీలను అప్రమత్తంగా ఉంచినట్లు- అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే పెద్ద సంఖ్యలో ఇవి మార్కెట్లో ఉన్నాయని హెచ్చరించారు. మార్కెట్లో మొత్తం ఎన్ని ఉన్నాయో గుర్తించడం కష్టమని ఉగ్ర ఫైనాన్స్‌పై దర్యాప్తు చేస్తున్న ఓ అధికారి చెప్పారు. ప్రజలు, వ్యాపార సంస్థలు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. దీంతో ఇప్పుడు ప్రజలు కూడా అసలేదో, నకిలీ ఏదో తెలుసుకోలేక కంగారు పడాల్సిన దుస్థితి ఏర్పడింది.

# కేటీఆర్‌కు హైకోర్టులో ఊరట

## ఉట్నూరు కేసు కొట్టివేత

**ప్రజా దీవెన, హైదరాబాద్ :** మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు తెలంగాణ హైకోర్టులో భారీ ఊరట లభించింది. ఉట్నూరు పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. గతేడాది సెప్టెంబర్‌లో కేటీఆర్‌పై ఉట్నూరు పీఎస్‌లో కేసు నమోదు అయింది. కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును ఛాలెంజ్ చేస్తూ కేటీఆర్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసుకు సంబంధించి న్యాయస్థానంలో సుదీర్ఘంగా వాదనలు జరిగాయి. ఇరువైపుల వాదనలు విన్న జస్టిస్ కె.లక్ష్మణ్ బెంచ్ కేటీఆర్‌పై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. గతంలో ప్రభుత్వం రూ.25 వేల కోట్ల కుంభకోణానికి పాల్పడిందని కేటీఆర్ వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణమ్మ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అంతేకాకుండా మాజీ మంత్రి కామెంట్స్‌పై స్థానికంగా ఉన్న ఉట్నూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మూసీ ప్రక్షాళనపేరుతో కుంభకోణం చేశారంటూ కేటీఆర్ అన్నారని, ఎలాంటి ఆధారాలు లేకుండా మాజీ మంత్రి వ్యాఖ్యలు చేశారంటూ సుగుణమ్మ పోలీసులకు కం÷-లపైంట్ చేశారు. ఈ క్రమంలోనే కేటీ-ఆర్‌పై ఉట్నూరు పోలీసులు పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఈ కేసులను సవాల్ చేస్తూ కేటీఆర్ హైకోర్టులో పిటిషన్ చేశారు. ఉట్నూర్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని పిటిషన్‌లో కోరారు. దీనిపై సుదీర్ఘంగా వాదనలు జరుగగా.. హైకోర్టు ఈరోజు (సోమవారం) తుది తీర్పును వెల్లడించింది. మాజీ మంత్రి కేటీ-ఆర్‌పై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేస్తూ జస్టిస్ కె.లక్ష్మణ్ బెంచ్ తీర్పును వెలువరించింది.

# నేడే ఇంటర్' విడుదల

**ప్రజా దీవెన, హైదరాబాద్ :** తెలంగాణలో ఇంటర్ ఫలితాలను విడుదల చేసేందుకు అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు- చేశారు. మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇంటర్ ఫలితాలు విడుదల చేస్తారని ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య వెల్లడించారు. మరో మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా పాల్గొననున్నారు. ఇంటర్ ఫస్ట్ ఇయర్, సెకండ్ ఇయర్ ఫలితాలను ఒకేసారి విడుదల చేయబోతున్నారు. కృష్ణ ఆదిత్య మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 10 లక్షల మంది విద్యార్థులు పరీక్షలు రాశారు.. ఫలితాలను సీజీజీ ప్రాసెస్ చేసింది.. వాళ్ళకి వారం రోజుల టైమ్ కావాలని అడిగారు ఇచ్చాము.. 2 గంటల తర్వాత ఫలితాలు వెబ్ సైట్ లో అందుబాటు-లో ఉంటాయి.. సర్వర్ లో ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకున్నాం.. 60 లక్షల జవాబు పత్రాలను కరెక్షన్ చేయడం జరిగింది.. పేపర్ కరెక్షన్ ప్రక్రియలో 18 వేల 500 మంది టీచర్లు పాల్గొన్నారు.. పారదర్శకత కోసం అన్ని సెంటర్ లలో సీసీ కెమెరాలు పెట్టాము.. ఆన్సర్ స్క్రిప్టులను రాండమ్ గా చెక్ చేసాము.. పరీక్ష ఫలితాల్లో ఎలాంటి పొరపాట్లు- రాకుండా లేకుండా అన్ని చర్యలు తీసుకున్నాం..విద్యార్థులకు అనుమానాలు ఉంటే రీ వెరిఫికేషన్ చేయించుకోవచ్చు అని తెలిపారు. ఇంటర్ ఫలితాలు నేరుగా ఇంటర్మీడియట్ బోర్డు అధికారిక వెబ్‌సైట్ షశి.-గగ.గు. లేదా స!షషె.-గగ.గు. లో అందుబాటులో ఉండనున్నాయి. ఎన్టీవీ విద్యార్థుల కోసం ఇంటర్ ఫలితాలను అందిస్తోంది.. కింద చూయించిన లింక్‌ను క్లిక్ చేసి.. మీ హాల్‌టికెట్ నంబర్ -టైప్ చేస్తే చాలు.. ఇట్టే ఇంటర్ ఫస్టియర్‌తో పాటు-.. ఇంటర్ సెకండియర్ ఫలితాలను చూసుకోవచ్చని అన్నారు.

# తెలంగాణ తెచ్చుకుందే జాబ్స్ కోసం

మొదటి పేజీ తరువాయి

జిల్లా మధిరలో మెగా జాబ్‌మేళా కార్యక్రమం జరిగింది. ఒకేరోజు 5 వేల మందికి ఉపాధి దక్కింది. ఉద్యోగాలు పొందిన వారికి డిప్యూటీ సీఎం భట్టి నియామకపత్రాలు అందజేశారు. మెగా జాబ్ మేళా కార్యక్రమంలో డిప్యూటీ సీఎంభట్టి విక్రమార్క మాట్లాడుతూ.. తెలంగాణ తెచ్చుకున్నదే ఉద్యోగాల కోసం. తెలంగాణ తెచ్చుకున్నాక ఓ కుటుంబానికి మాత్రమే ఉద్యోగాలు వచ్చాయి. కాంగ్రెస్ ప్రజా పాలనలో నిరుద్యోగులందరికీ పారదర్శకంగా ఉద్యోగాలు ఇస్తున్నాం. బీఆర్ఎస్ హయాంలో పేపర్ లీకేజీలతో సమయం అయిపోయింది. కాంగ్రెస్ హయాంలో నిరుద్యోగులకు



పారదర్శకంగా ఉద్యోగాలు కల్పిస్తున్నాం. గత పది సంవత్సరాల్లో నిరుద్యోగులు, ఉద్యోగులు ఫలితాలు సాధించలేకపోయారు. ప్రజా ప్రభుత్వంలో మూడంచల్లో ఉద్యోగాల కల్పిస్తున్నాం. ఒకటి ప్రభుత్వ ఉద్యోగాలు, రెండు బహుళ జాతి సంస్థలకు వనరులు ఏర్పాటు చేసి రాష్ట్ర యువతకు పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు, మూడు ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు రాజీవ్ యువ వికాసం, జాబ్ మేళాలు. 5,000 మందికి యువతకు ఉపాధి కల్పించేందుకు హైదరాబాదులో మరో నాలెడ్జ్ సిటీ ఏర్పాటు చేస్తున్నాం. మధిర జాబ్ మేళా ద్వారా 5,000 మందికి ఒకేరోజు ఉపాధి లభించింది. రాష్ట్ర వనరులు, రాష్ట్ర భవిష్యత్తుకు, జీడీపీ పెరుగుదలకు, కుటు-ంబానికి, సమాజానికి పెద్ద ఎత్తున యువత ఉపయోగపడాలి. ప్రతి ఆలోచన మంచిది అయితే మంచి ఫలితాలు సాధిస్తారు. యువత మత్తు పదార్థాలు, సంఘ విద్రోహశక్తులకు దూరంగా ఉండాలి. చివరి దశలో తల్లిదండ్రులు బాధపడకుండా యువత చూసుకోవాలని అన్నారు.

# భర్తను కరెంట్ షాక్‌తో చంపిన భార్య



**ప్రజా దీవెన, హైదరాబాద్ :** హైదరాబాద్‌లో దారుణం చోటుచేసుకుంది. భర్తతో విసిగిపోయిన భార్య కరెంట్ షాక్ ఇచ్చి చంపేసింది. ఆ తర్వాత మృతదేహాన్ని పూడ్చిపెట్టింది. నేరం నుంచి తప్పించు కునేందుకు ప్లాన్ చేసింది. కానీ, బంధువులు అనుమానంతో వ్యక్తం చేసి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అసలు బండారం బయటపడింది. పోలీసుల వివరాల ప్రకారం.. కేపీహెచ్‌బీకి చెందిన సాయిలు, కవిత దంపతులు. 15 ఏళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. భార్యకు, భర్తకు ఇద్దరికీ వివా హేతర సంబంధాలు ఉన్నాయి. కొన్నాళ్లుగా విడిగా ఉంటున్నారు. అయితే, తరచుగా భార్య ఉంటున్న ఇంటికి వచ్చి సాయిలు వేధింపులకు పాల్పడే వాడని సమాచారం. దీంతో విసిగిపోయిన కవిత భర్తను లేకుండా చేయాలని నిర్ణయించుకుంది. ఇందుకు చెల్లెలు, చెల్లెలి భర్త సాయం తీసుకుంది. ముగ్గురూ కలిసి ప్లాన్ చేసి సాయిలును కరెంట్ షాక్ తో చంపేశారు. ఆపై గుట్టుచప్పుడు కాకుండా మృతదేహాన్ని పాతిపెట్టి కవిత సొంతూరుకు వెళ్లిపోయింది. సాయిలు గురించి అడిగిన వారికి పని కి వెళ్లి తిరిగిరాలేదని చెప్పింది. అయితే, కవిత తీ రు అనుమానాస్పదంగా ఉండడంతో సాయిలు బంధువులు పోలీసులను ఆశ్రయించారు. వారి ఫిర్యాదుతో విచారణ చేపట్టిన పోలీసులు.. కవితను ప్రశ్నించగా నేరం అంగీకరించింది. పోలీసులు కవితను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు.



# అవకాశాల ఆశలు

మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఒసాకాలో జరుగుతున్న వరల్డ్ ఎక్స్‌పోలో దేశంలోనే మొదటి రాష్ట్రంగా తెలంగాణ పాలుపంచుకోవటం గర్వంగా ఉందని అన్నారు. తెలంగాణ, జపాన్‌ల మధ్య ఉన్న చారిత్రక స్నేహాన్ని దీర్ఘకాల భాగస్వామ్యంగా మార్చుకుందామని పిలుపునిచ్చారు. కొత్త ఆవిష్కరణలతో భవిష్యత్ ప్రణాళికల రూపకల్పనకు కలిసి పనిచేద్దామనే ఆకాంక్షను వ్యక్తం చేశారు. ప్రభుత్వం అనుసరిస్తున్న స్థిరమైన విధానాలు, సులభతర పారిశ్రామిక విధానం, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు తెలంగాణలో ఉన్నాయన్నారు. 'హైదరాబాద్‌కు రండి.. మీ ఉత్పత్తులు తయారు చేయండి.. భారత మార్కెట్‌తో పాటు ప్రపంచంలోని వివిధ దేశాలకు ఎగుమతి చేసేందుకు తెలంగాణను గమ్యస్థానంగా ఎంచుకొండి..' అని జపాన్ కంపెనీలను సీఎం తెలంగాణకు ఆహ్వానించారు. తెలంగాణకు జపాన్ మధ్య చక్కటి సంబంధాలున్నాయని, ఒసాకా బేలో సూర్యోదయం లాంటి కొత్త అధ్యాయం తెలంగాణలో ప్రారంభమవుతోందని ముఖ్యమంత్రి అభిప్రాయ పడ్డారు. తెలంగాణతో పాటు- ఒసాకా, ప్రపంచంతో కలిసికట్టుగా అద్భుతమైన భవిష్యత్తును నిర్మిద్దామని పిలుపునిచ్చారు. ఐటీ-, బయో -టె-క్నాలజీ రంగాల్లో తెలంగాణ ఇప్పటికే ప్రత్యేకమైన గుర్తింపు సాధించిందని ఐటీ-, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. వీటితో పాటు- ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్, టెక్స్‌టైల్స్ రంగాల పరిశ్రమలకు ఉన్న అనుకూలతలను వివరించారు. హైదరాబాద్ లో 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ-'ని నిర్మిస్తున్నామని, ఎకో, ఎనర్జీ, స్మార్ట్ మొబిలిటీ, సర్క్యులర్ ఎకానమీపై ఈ సిటీ ఆధారపడుతుందన్నారు. జపాన్‌కు చెందిన మారుబెని కార్పొరేషన్‌తో ఫ్యూచర్ సిటీలో ఇండస్ట్రియల్ పార్క్‌ను ఏర్పాటు- చేస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్ చుట్టూ 370 కిలోమీటర్ల రీజనల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్), రేడియల్ రోడ్లతో పాటు- ఆర్ఆర్ఆర్ కు ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) మధ్య ఉన్న జోన్‌లో ఎలక్ట్రిక్ వాహనాలు, ఎనర్జీ స్టోరేజ్, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్స్, ఏరోస్పేస్ పరిశ్రమలకు అనువైన వాతావరణం ఉందన్నారు. ఎగుమతులకు వీలుగా సమీప ఓడరేవుతో అనుసంధానించే డ్రై పోర్ట్ ను తెలంగాణలో ఏర్పాటు చేస్తున్నట్లు- వివరించారు. మూసీ పునరుజ్జీవనంలో భాగంగా నది పొడవునా 55 కిలోమీటర్ల అర్బన్ గ్రీన్ వే అభివృద్ధి చేసేందుకు టోక్యో, ఒసాకా నగరాలను చూసి ఎంతో నేర్చుకోవాల్సి ఉందని అన్నారు. నైపుణ్యాల శిక్షణతో పాటు- నాణ్యత, క్రమశిక్షణకు అద్దం పట్టేలా యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్శిటీ- ఏర్పాటు- చేశామని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ అన్నారు. ఈ యూనివర్సిటీ- రాష్ట్రంలో ఉపాధి, వ్యాపార అవకాశాలను రెట్టింపు చేస్తుందన్నారు.

# తెలుగు రాష్ట్రాల జడ్జీల బదిలీ

**ప్రజా దీవెన, హైదరాబాద్ :** ఏపి, తెలంగాణ హైకోర్టుల న్యాయమూర్తుల బదిలీ జరిగింది. ఈమేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సుల మేరకు తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కె.సురేందర్ మద్రాస్ హైకోర్టుకు.. జస్టిస్ పి.శ్రీసుధ కర్ణాటక హైకోర్టుకు బదిలీ అయ్యారు. ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.మన్మథరావును కర్ణాటక హైకోర్టుకు బదిలీ చేశారు.

# ఈ-సిగరెట్లు విక్రయిస్తున్న ముఠా అరెస్ట్

**ప్రజా దీవెన, హైదరాబాద్ :** విద్యా సంస్థల సమీపాల్లో నిషేధిత ఈ-సిగరెట్లు, వేప్స్ విక్రయిస్తున్న ముఠాను తెలంగాణ యాంటీనార్కోటిక్స్ బ్యూరో, హైదరాబాద్ సిటీ పోలీసులతో కలిసి అరెస్ట్ చేసింది. ఈ ముఠా చిన్నారులు, యువతపై లక్ష్యంగా ఈ ఉత్పత్తులను విక్రయిస్తోంది. సాదిక్ లలాని, అనిల్ లలాని అనే సోదరులు, నాంపల్లి ప్రాంతంలో నివసిస్తూ, ఆయ గ్రూప్ ద్వారా 500 మందికి పైగా సభ్యులకు ఈ ఉత్పత్తులను ఆన్‌లైన్‌లో ప్రొమోట్ చేసి విక్రయించేవారు. వాట్సాప్ గ్రూప్ ద్వారా కొత్త స్టాక్ వచ్చినప్పుడల్లా ప్రకటనలు పెట్టేవారు. వినియోగదారులు వారి కుటుంబ సభ్యుల ఖాతాలకు వాలెట్, బ్యాంక్ మార్గాల్లో డబ్బులు పంపించేవారు. ఈ ముఠాకు న్యూఢిల్లీలోని అమిత్, ముంబైకి చెందిన వసీం అనే వ్యక్తులు సరఫరాదారులుగా పనిచేస్తున్నారు. భారీ మొత్తాల కోసం హవాలా మార్గాలు కూడా ఉపయోగించేవారు. ర్యాపిడో, ఉబర్, ఉ÷ుఉఈ ద్వారా డెలివరీ చేసేవారు. చదువుతున్న 13 మంది మైనర్లు ఈ ముఠా ఖాతాదారులుగా గుర్తించబడ్డారు. వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వనున్నారు. అలాగే, 400 మందికి పైగా వినియోగదారులు ట్రాన్సాక్షన్ల ద్వారా గుర్తించబడ్డారు. 7 కార్టన్ బాక్సుల్లో 1217 పీస్‌లు స్వాధీనం చేసుకోగా, వీటి విలువ రూ. 25 లక్షలు. అదనంగా రూ.18,440, 225 అమెరికన్ డాలర్లు, 100 కెనడియన్ డాలర్లు కూడా స్వాధీనం చేసుకున్నారు.

# వాహనాలకు కలర్ స్టిక్కర్లు తప్పనిసరి

**ప్రజా దీవెన, న్యూఢిల్లీ :** ఢిల్లీ నగరంలో రవాణ శాఖ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. మోటర్ వెహికిల్ చట్టంలోన నిబంధనల ప్రకారం ఇంధన రకాన్ని సూచించే కలర్ కోడెడ్ స్టిక్కర్లు వాహనాలకు తప్పనిసరగా అంటించాలని లేని పక్షంలో భారీ జరిమానా ఉంటుందని వెల్లడించింది. ఈ నిబంధన పాటించని వాహనదారులపై రూ.5వేలు జరిమానా విధిస్తారని తెలిపింది. 2012-13లో ప్రవేశపెట్టబడిన హై సెక్యూరిటీ-రిజిస్ట్రేషన్ ప్లేట్‌లో భాగంగా ఈ స్టిక్కలరులు అతికించాలి. ఈ స్టికర్ లేని వాహదారులకు జరిమాన విధించడమే కాక పొల్యూషన్ సర్టిఫికెట్ కూడా పొందలేరు. నిబంధనల ప్రకారం డీజిల్ వాహనాలకు నారింజ రంగు, పెట్రోల్ సిఎన్‌జిలకు నీలం రంగు, మిగిలిన వాహనాలకు బూడిద రంగు స్టిక్కర్లు అంటించాలి.

# రోహిత్ వేముల' చట్టాన్ని తీసుకరండి



**ప్రజా దీవెన, ఢిల్లీ:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ లేఖ రాశారు. రాష్ట్రంలో యువత హత్యలను నిరోధించేందుకు 'రోహిత్ వేముల' చట్టాన్ని తీసుకురావాలని ఆ లేఖలో కోరారు. రోహిత్ వేముల, పాయల్ తడ్వి, దర్శన్ సోలంకి వంటి మంచి భవిష్యత్తు ఉన్న యువకులు అర్ధాంతరంగా తమ జీవితాలను ముగించారని ఆ లేఖలో పేర్కొన్నారు. ఇలాంటి ఆత్మహత్యలను నివారించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణలో యువత హత్యలను ఆపేందుకు ఈ కొత్త చట్టాన్ని తీసుకురావాలని ఆయన సూచించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్, రోహిత్ వేములతో పాటు లక్షలాది మంది ఎదుర్కొన్న వివక్షను ఇతరులు ఎదుర్కోకుండా ఉండేందుకు 'రోహిత్ వేముల' చట్టాన్ని తీసుకురావాలని సూచించారు. రాహుల్ గాంధీ రెండు రోజుల క్రితం కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు కూడా 'రోహిత్ వేముల' చట్టాన్ని రూపొందించి అమలు చేయాలని లేఖ రాశారు. అయితే రోహిత్ చట్టంపై భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి స్పందించారు. రాహుల్ గాంధీ ఏం ఆలోచించినా ప్రజల కోసమే ఆలోచిస్తారని అన్నారు. రోహిత్ చట్టం తేవాలని రాహుల్ గాంధీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారని తెలిపారు. రోహిత్ చట్టంపై సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకుంటారని అన్నారు. గాంధీభవన్‌లో సోమవారం ఎంపీ చామల కిరణ్ మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ చేసిన తప్పులకు రజతోత్సవ సభలో తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. కేసీఆర్ పిట్టల దొర, కేటీఆర్ తుపాకీ రాముడని ఎద్దేవా చేశారు. ప్రజల నుంచి దోచుకున్న డబ్బులతో రజతోత్సవ సభ నిర్వహిస్తున్నారని తెలిపారు. రజతోత్సవాలు బీఆర్ఎస్ పార్టీకా, టీఆర్ఎస్ పార్టీకా అని ప్రశ్నించారు. రజతోత్సవ బ్యానర్‌లో బీఆర్ఎస్ అని ఉంటుందా.. టీఆర్ఎస్ అని ఉంటుందా అని నిలదీశారు. కేటీఆర్ మళ్లీ చంద్రబాబు, రాజశేఖర్ రెడ్డిలను స్మరించుకున్నారని అన్నారు. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావలసిన అవసరం ఏముందని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రశ్నించారు. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అయ్యి చేసేదేముందని ప్రశ్నల వర్షం ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కురిపించారు. తుపాకీ రాముడు కేటీఆర్ బాధ ఏంటో అర్థం కావడం లేదన్నారు. భారీ డైలాగులు కొట్టి కేసీఆర్ అధికారంలోకి వచ్చారని అన్నారు. కళ్లముందు జరిగిన చరిత్రను కేటీఆర్ వక్రీకరిస్తున్నారని ఆరోపించారు. గాంధీ, నెల్సన్ మండేలా లాగా కేసీఆర్ ఫీల్ అవుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ అధ్యక్ష పదవిపై కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. బీఆర్ఎస్ అధ్యక్ష పదవి బీసీలకు ఇవ్వనున్నట్లు సమాచారముందని అన్నారు. బీఆర్ఎస్ అధ్యక్షుడిగా బీసీ నేతకు అవకాశం ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నానని తెలిపారు. కాంగ్రెస్ కులగణన ఫలితమే బీఆర్ఎస్ పార్టీ బీసీని అధ్యక్షుడిగా నియమిస్తోందని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

# మూడ్రోజులు మద్యం షాపుల మూసివేత

**ప్రజా దీవెన, హైదరాబాద్ :** నగరంలోని మందుబాబులకు ఇది షాకింగ్ న్యూస్. ఈ నెల 23వ తేదీన హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం 4 గంటల నుంచి బుధవారం సాయంత్రం 6 గంటల వరకూ మద్యం అమ్మకాలు బంద్‌అయ్యాయి. వైన్స్, బార్ అండ్ రెస్టారెంట్లు-, క్లబ్‌లు మూసి వేయాలని పోలీసులు అదేశాలు జారీ చేశారు. తిరిగి బుధవారం సాయంత్రం నుంచి ప్రారంభం కానున్న మద్యం అమ్మకాలు.. శుక్రవారం ఆగిపోనున్నాయి. శుక్రవారం ఎన్నికల కౌంటింగ్ కారణం మళ్లీ అన్ని మద్యం షాపులు బంద్ అవుతాయి.

# పసుపుబోర్డు ఘనత మాదే

- బోర్డు పనులు ప్రారంభించని కేంద్రం
- కాళేశ్వరంతో రాష్ట్రం దివాళా
- ప్రాణహిత చేవెళ్ల చేపట్టివుంటే నిజామాబాద్‌కు నీరందేది
- నిజామాబాద్ రైతు మహోత్సవ సభలో మంత్రిఉత్తమ్
- పామాయిల్ సాగుతో మంచి లాభాలన్న మంత్రి తుమ్మల



**ప్రజా దీవెన, నిజామాబాద్ :** పసుపు బోర్డు తెచ్చిన ఘనత తమదేనని, దానికోసం తాను పోరాటం చేశానని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. బోర్డు ఏర్పాటు చేశారు కానీ ఇంకా పనులు ఎందుకు ప్రారంభించలేదని కేందరాన్ని ఆయన ప్రశ్నించారు. గత పదేళ్లలో ప్రాణహిత చేవెళ్లను పట్టించుకోలేదని విమర్శించారు. 22వ ప్యాకేజికి వెంటనే నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. నిజామాబాద్‌లో రైతు సభలో మాట్లాడుతూ ..నిర్లక్ష్యం చేసే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గన్నీ బ్యాగుల కొరత లేకుండా చూడాలని సూచించారు. కాళేశ్వరంతో కొత్తగా ఆయకట్టు పెరగలేదని అన్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టును ఆధునీకరిస్తామని స్పష్టం చేశారు. పూడికతీత పనులకు వచ్చే నెలలో టెండర్లు పిలుస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. పెండింగ్‌లో ఉన్న ధాన్యం బోనస్ డబ్బులను త్వరలోనే విడుదల చేస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు నిర్మించి ఉంటే ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు ఎంతో ఉపయోగం ఉండేదన్నారు. గత ప్రభుత్వం సాగునీటిపై రూ.లక్ష కోట్లకు పైగా ఖర్చు చేసినా.. అదనంగా ఒక్క ఎకరానికీ నీరు ఇవ్వలేదని విమర్శించారు. రైతు సంక్షేమ కార్యక్రమాల్లో తెలంగాణకు సాటి వచ్చే రాష్ట్రం మరొకటి లేదన్నారు. రాష్ట్రానికి పసుపుపారాణి లాంటిది నిజామాబాద్ జిల్లా అని పేర్కొన్నారు. ప్రతి జిల్లాలో ఆయిల్‌పామ్ పరిశ్రమ ఏర్పాటు చేసే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంది. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో ఈ సాగు పెరగాల్సి ఉంది. 4 ఎకరాల వరిసాగుతో వచ్చే లాభం ఎకరం ఆయిల్‌పామ్ తోటతో వస్తుందని తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. అయితే జిల్లాలో పసుపు బోర్డు ఏర్పాటు చేసినందుకు కేంద్ర ప్రభుత్వానికి వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు. పసుపు బోర్డు రైతులకు ఉపయుక్తంగా కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. తెలంగాణకు పసుపుపారాణి లాంటిది నిజామాబాద్ జిల్లా అని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. నిజామాబాద్‌లో రైతు మహోత్సవాన్ని ఆయన మరో మంత్రి జూపల్లితో కలిసి ప్రారంభించారు. పసుపు పంటకు మద్దతు వస్తేనే.. పసుపురైతు తలెత్తుకుని ఉండగలడు అని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో రైతులు ఓటేసినందునే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని...ఇది రైతు ప్రభుత్వమని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. రైతులను విదేశాలకు తీసుకెళ్లాలని మంత్రులు, అధికారులకు విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ లక్షల కోట్ల అప్పులు నెత్తిన పెట్టి పోయినా రేవంత్ సర్కార్ ఆరు గ్యారంటీలతో పాటు సన్నబియ్యం పథకం అమలు చేస్తుందని ఉద్ఘాటించారు. ఈ ప్రభుత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత రైతులదని బొమ్మా మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు.

## తెలంగాణను కాపాడుకోవడమే లక్ష్యం

- కేసీఆర్‌కు, కార్యాకర్తలకు మధ్య వారధిగా ఉంటా
- ఖమ్మం నుంచి ముగ్గురు మంత్రులున్నా సున్నా
- ఎమ్మెల్సీ కవిత వెల్లడి



**ప్రజా దీవెన, ఖమ్మం :** తెలంగాణను కాపాడటమే బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల ప్రథమ కర్తవ్యమని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నుంచి తెలంగాణను కాపాడే బాధ్యత బీఆర్ఎస్ పార్టీకే ఉంటుందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు, పార్టీ కార్యకర్తలకు వారధిగా ఉంటానని స్పష్టం చేశారు. సోమవారం జరిగిన సన్నాహక సమావేశంలో కార్యకర్తల సమస్యలను కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానని, ఏ చిన్న అవసరమున్నా తనను కార్యకర్తలు సంప్రదించవచ్చని పేర్కొన్నారు. కార్యకర్తలను కాపాడు కోవడాన్ని బాధ్యతగా భావిస్తానని స్పష్టం చేశారు. అన్ని రంగాల్లో తెలంగాణను నెంబర్ వన్‌గా నిలబెట్టిన ఘనత కేసీఆర్‌ది అని ఎమ్మెల్సీ కవిత కొనియాడారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ఒక్క సెకండ్ కూడా విశ్రాంతి తీసుకోకుండా కేసీఆర్ పని చేశారని తెలిపారు. సీతారామ ప్రాజెక్టును నిర్మించి 3.5 లక్షల ఎకరాలకు కేసీఆర్ నీళ్లు అందించారని పేర్కొన్నారు. తెలంగాణకు బీఆర్ఎస్ పార్టీనే శ్రీరామ రక్ష అని అన్నారు. తెలంగాణ ఉద్యమం పుట్టిందే ఖమ్మం జిల్లా నుంచి అని చెప్పారు. 1969లో ఖమ్మంలో మొదలైన తెలంగాణ ఉద్యమం రాష్ట్రమంతా పాకిందని అన్నారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ద్రోహి అని విమర్శించారు. భద్రాచలంలో ఉప ఎన్నిక వస్తే గెలుపు బీఆర్ఎస్ పార్టీదే అని చెప్పారు. అలాంటి ద్రోహులను చాలామందిని చూశామని.. కుట్రలను చూశామన్నారు. ఖమ్మం జిల్లా నుంచి ముగ్గురు మంత్రులున్నా మూడు పైసలు తేలేదని ఎమ్మెల్సీ కవిత అన్నారు. ఆత్మీయ భరోసా కింద నిరుపేదలకు డబ్బులు ఇవ్వకుండా కాంగ్రెస్ సర్కార్ మోసం చేసిందని విమర్శించారు. మన కళ్ల ముందే మన తెలంగాణ ఆగమవుతుంటే చూస్తూ ఊరుకోవద్దని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలను సమీకరించాల్సిన అవసరం ఉందని అన్నారు. అప్పులపై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క విపరీతమైన అబద్దాలు చెబుతున్నారని తెలిపారు. 2004లో చచ్చిన పీనుగులా ఉన్న కాంగ్రెస్ పార్టీ బీఆర్ఎస్ తో పొత్తు పెట్టుకొని అధికారంలోకి వచ్చిందని పేర్కొన్నారు. 2004లోనే తెలంగాణ ఇచ్చేస్తామని చెప్పిన కాంగ్రెస్ పదేళ్లు ప్రజలను ఏడిపించిందని అన్నారు. వందలాది మంది బిడ్డలను పొట్టనపెట్టు-కొని తెలంగాణ ఇచ్చారు తప్పా ఉట్టిగా ఇవ్వలేదని అన్నారు. లక్షా 60 వేల కోట్లకుపైగా అప్పు తెచ్చిన సర్కారును ప్రశ్నిస్తే బుకాయిస్తున్నారని తెలిపారు. తెచ్చిన రుణాన్ని ఏం చేశారని అడిగితే చెప్పబోమని అంటు-న్నారని పేర్కొన్నారు. తెచ్చిన అప్పులను ఎక్కడ ఖర్చు చేశారో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. 40 వేల కోట్ల విలువైన భూములను 10 వేల కోట్లకు ప్రభుత్వం తాకట్టు- పెట్టిందని ఎమ్మెల్సీ కవిత అన్నారు. 10 వేల కోట్లతో రైతు భరోసా, రుణమాఫీ చేశామని మంత్రులు చెబుతున్నారు కానీ ఇప్పటికీ 60 శాతం మందికి రుణ మాఫీ కాలేదు, 50 శాతం మందికి రైతు భరోసా రాలేదని పేర్కొన్నారు. మరి ఈ 10 వేల కోట్లు- ఎక్కడ పోయినట్లు- అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎక్కడికక్కడ నిలదీయాలని సూచించారు. ప్రస్తుత పాలకులు చూడటానికి తెలంగాణ వ్యక్తుల్లా ఉంటారు... కానీ పనిచేసేది తెలంగాణకు వ్యతిరేకంగా అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అనేక కల్లిబొల్లి మాటలు చెప్పింది.. లేనిపోని హామీ ఇచ్చిందని తెలిపారు. అధికారంలోకి వచ్చి 16 నెలలు గడిచినా ఒక్క హామీని కూడా పూర్తిగా అమలు చేయలేదని విమర్శించారు.

## ఆది శ్రీనివాస్‌కు జరిమానా కట్టిన చెన్నమనేని



**ప్రజా దీవెన, హైదరాబాద్ :** ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ రూ. 25లక్షల డీడీని హైకోర్టులో అందించారు. జర్మన్ పౌరసత్వం ఉండి రమేశ్ వేములవాడ ఎమ్మెల్యేగా పోటీ చేశారని గతంలో శ్రీనివాస్ హైకోర్టుని ఆశ్రయించారు. రమేశ్ జర్మన్ పౌరసత్వం నిజమేనని గతేడాది డిసెంబర్ లో నిర్ధారించిన కోర్టు, శ్రీనివాస్ కు రూ. 25లక్షలు, న్యాయసేవ ప్రాధికార సంస్థకు రూ. 5లక్షలు చెల్లించాలని ఆదేశించింది. దీంతో సోమవారం రమేశ్ జరిమానా కట్టారు. వేములవాడ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ ఇండియన్ సిటిజన్ కాదని తాను ముందు నుంచీ చెబుతూనే ఉన్నానని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పందించారు. చెన్నమనేని తప్పుడు పత్రాలు సృష్టించి ఎన్నికల్లో పోటీ- చేయకుంటే పదేండ్ల క్రితమే తాను ఎమ్మెల్యే అయ్యేవాడిని తెలిపారు. కోర్టులపై ప్రజలకు విశ్వాసం పెరిగిందని చెప్పారు. వేములవాడ నియోజకవర్గ ప్రజలను మోసం చేసిన చెన్నమనేని క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

## లంచగొండి ఉద్యోగులు

### నాలుగు చోట్ల ఏసీబీకి చిక్కిన నలుగురు పట్టివేత

**ప్రజా దీవెన, హైదరాబాద్ :** ఏసీబీ అవినీతి అధికారుల భరతం పడుతోంది. ఒక్క రోజే పలు ప్రాంతాల్లో నలుగురు ప్రభుత్వ ఉద్యోగులు లంచం తీసుకుంటుండగా పట్టుబడ్డారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు సీఐ, జనగామ జిల్లా చిల్పూర్ తహసిల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారి, నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పంచాయతీరాజ్ సీనియర్ అసిస్టెంట్ పట్టుబడగా.. తాజాగా లంచం తీసుకుంటూ మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా నాగారం మున్సిపల్ డీఈ రఘు ఏసీబీకి దొరికాడు. నాగారం మున్సిపాలిటీలో రమేష్ అనే కాంట్రాక్టర్ దగ్గర రూ. 75వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. నాగారం మున్సిపల్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు కొనసాగుతున్నాయి. జనవరి 27 , 2025 నుంచి నాగారం మున్సిపాలిటీ- పదవి కాలం పూర్తయింది. ఆ రోజు నుంచి జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్త స్పెషల్ ఆఫీసర్‌గా బాధ్యతలు చేపట్టారు. జిల్లా అధికారి స్పెషల్ ఆఫీసర్ ఉన్నా.. అధికారులు లంచం తీసుకోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం మణుగూరు పోలీస్ స్టేషన్ లో ఏసీబీ అధికారులు రైడ్ చేశారు. పీఎస్ లో రూ. లక్ష లంచం తీసుకుంటుండగా సీఐ సతీష్ కుమార్, ఆయన అనుచరుడు ఓ తెలుగు న్యూస్ ఛానల్ జర్నలిస్ట్‌ను ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఓ భూమి సెటిల్ మెంట్ విషయంలో ఆరుగురు వ్యక్తుల దగ్గర నుంచి రూ. 15 లక్షల వరకు డిమాండ్ చేశాడు మణుగూరు సీఐ సతీష్ కుమార్. 4 లక్షలు ఇచ్చేందుకు ఒప్పుకున్నాడు. ఇందులో భాగంగా ముందుగా రూ. లక్ష పీఎస్‌లో సీఐ అనుచరుడికి ఇస్తుండగా.. ముందస్తు ప్రణాళికతో ఏసీబీ అధికారులు అతడిని పట్టుకున్నారు. లంచం తీసుకుంటుండగా పట్టుబడ్డ టీ-వీ ఛానల్ జర్నలిస్ట్ తో పాటు స్టేషన్ సీఐ ఫోన్లను తీసుకుని ఏసీబీ అధికారులు విచారిస్తున్నారు. లంచం తీసుకుంటూ మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎసిబి అధికారులకు పట్టుబడ్డాడు. ఈ సంఘటన జనగామ జిల్లా, స్టేషన్ ఘన్‌పూర్ మండలంలో సోమవారం చోటుచేసుకుంది. ఎసిబి డిఎస్‌పి సాంబయ్య కథనం ప్రకారం.. చిల్పూరు మండలానికి చెందిన ఆవుల లింగయ్య తన 1.20 ఎకరాల భూమిని సర్వే చేయమని కోరగా ఆర్ఐ వినయ్‌కుమార్ రూ. 26 వేలు లంచం డిమాండ్ చేశాడు. ఈ విషయాన్ని బాధితుడు ఎసిబి అధికారులకు వివరించాడు. వారి సూచనల మేరకు సోమవారం కార్యాలయంలో ఆ డబ్బులు స్వయంగా తీసుకుంటుండగా ఆర్ఐని పట్టు-కున్నారు. ఇటీవల స్టేషన్ ఘన్‌పూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎసిబి దాడి ఘటన మరువకముందే మళ్లీ దాడి జరగడంతో నియోజకవర్గ కేంద్రంలో చర్చనీయాంశమైంది. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎసిబి డిఎస్‌పి తెలిపారు.



## అంబేద్కర్ అందరివాడు

### కొందరికే పరిమితం చేయడం తగదు.. కేంద్రమంత్రి బండి సంజయ్

**ప్రజా దీవెన, కరీంనగర్ :** అంబేద్కర్ అందరివాడని, ఆయనను కేవలం దళితులకు చెందిన నేతగా చూడరాదని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. కరీంనగర్ శుభమంగళ గార్డెన్‌లో జయంతి ఉత్సవాల్లో కేంద్రమంత్రి బండి సంజయ్ పాల్గొన్నారు. కొంతమంది ఆ మహనీయుడిని దళితులకే పరిమితం చేస్తున్నారని .. కాని ఆయన భారతదేశ ప్రజలందరికి దేవుడన్నారు. అంబేద్కర్ జీవితాన్ని యువత ఆదర్శంగాతీసుకోవాలని బండి సంజయ్ సూచించారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ పడినన్ని అవమానాలు ఎవరు ఎదుర్కోలేదన్న కేంద్రమంత్రి వాటినే సోపానాలుగా మార్చుకొని తన చదువును దేశానికి ధారపోసిన గొప్పనేత అన్నారు. కాంగ్రెస్ పార్టీ అంబేద్కర్ ను అవమానించిందని.. ఆయనకు భారతరత్న ఇవ్వకుండా... ఎన్నికల్లో ఓడించిందన్నారు. అంబేద్కర్ చనిపోతే ఢిల్లీలో అంత్యక్రియలు చేసేందుకు అభ్యంతరం తెలిపిన కాంగ్రెస్ పార్టీ .. ఆయన పార్థివ దేహాన్ని ముంబయికి పంపి అప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ విమాన చార్జీలు వసూలు చేసిందన్నారు. అంబేద్కర్ ఆశయాలను బీజేపీ అమలు చేస్తుంటే కాంగ్రెస్ ఆయన చరిత్రను కనుమరుగు చేసేందుకు కుట్ర పన్నుతుందన్నారు. ఒకప్పుడు రిజర్వేషన్లను వ్యతిరేకించిన కాంగ్రెస్ ఓట్లకోసం ముస్లిం రిజర్వేషన్లకు కుట్ర చేసిందని కేంద్రమంత్రి బండిసంజయ్ అన్నారు.

## రాజ్యాంగాన్ని మార్చే కుట్రలో మోడీ

### సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ విమర్శలు




**ప్రజా దీవెన, రంగారెడ్డి :** రాజ్యాంగాన్ని మార్చేందుకు ప్రధాని మోదీ ప్రయత్నిస్తున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ నారాయణ విమర్శించారు. హైదరాబాద్ శంషాబాద్ పట్టణంలోని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలు రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మొదటి రోజు భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకుల ఆధ్వర్యంలో బహిరంగ సభ స్థానిక ఎంఎంఆర్ గార్డెన్‌లో నిర్వహించారు. సభకు ముఖ్య అతిథిగా పాల్గొన్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ.. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని మార్చే కుట్రలో ప్రధాని నరేంద్రమోదీ ఉన్నారని నారాయణ విమర్శించారు. అందులో భాగంగానే అన్ని వర్గాల ప్రజలకు ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ముఖ్యంగా పెట్టు-బడిదారులకు అనుకూలంగా కార్మిక చట్టాలను రద్దు చేశారని వివరించారు. కార్మికుల హక్కులను కాలరాయడంతో కార్మికులు యాజమాన్యాలు చెప్పిన విధంగా ఉండాలనే చట్టాలు తీసుకువచ్చారని మండిపడ్డారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగంలో అన్ని వర్గాలకు న్యాయం చేయకుండా కేవలం బీజేపీ నాయకులు పెట్టు-బడిదారులకు అనుకూలంగా రాజ్యాంగాన్ని మార్చుకోవడం కోసం కృషి చేస్తున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను అడ్డుకోవడం కోసం సీపీఐ కృషి చేస్తూ అనేక పోరాటాలు చేస్తుందని వివరించారు. దేశంలో ఇతర మతాలను కించపరిచే విధంగా వారి హక్కులను లేకుండా చేస్తున్న బీజేపీకి ప్రజలు తగ్గిన బుద్ధిచెప్పాలని నారాయణ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి సైతం తెలంగాణను అభివృద్ధి చేయకుండా పట్టు-బడుల పేరుతో విదేశాలలో జల్సాలు చేస్తున్నారని ఆరోపించారు. అనేక వనరులు ఉన్న తెలంగాణలో అభివృద్ధి చేయలేని రేవంత్‌రెడ్డి విదేశాలలో పర్యటించి తెలంగాణ ప్రజల సోమ్ముతో సోకులు చేస్తున్నారని విమర్శించారు. పేదలకు న్యాయం జరిగే విధంగా అభివృద్ధి పనులు చేయాలని సలహా ఇచ్చారు.

## రెవెన్యూ అధికారులపై పొంగులేటి ఆగ్రహం

### చట్టాలపై అవగాహన లేకపోవడంపై మండిపాటు

**ప్రజా దీవెన, నల్గొండ :** రెవెన్యూ అధికారుల తీరుపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం నల్గొండ జిల్లా చందంపేటలో భూభారతిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి పొంగులేటి హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులు తమ భూ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. రైతులు ఫిర్యాదుతో ఆర్డీవో రమాణారెడ్డి, తహసీల్దార్‌లను మంత్రి ప్రశ్నలు అడగగా వారి నుంచి ఎలాంటి సమాధానం రాలేదు. దీంతో రెవెన్యూ డివిజన్‌పై ఏమాత్రం అవగాహన లేకుండా ఎలా ఉన్నారని ఆర్డీవోపై పొంగులేటి ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. ఇకపోతే అంతకుముందు ఇబ్రహింపట్నంలో జరిగిన సదస్సులో మంత్రిపాల్గొన్నారు. రైతుల సమస్యకు భూభారతి తీసుకుని వచ్చామని అన్నారు. ధరణితో అక్రమాలు చోటు చేసుకున్నాయని, వాటికి ఇందులో చెక్ పెట్టామని అన్నారు.





# ఓ మిథ్య

ఏటా ధాన్యం సేకరన ఓ ప్రహసనంగా మారింది. ధాన్యం పండిస్తున్న అన్నదాతలను అభినందించి, ధాన్యం సేకరించాల్సన ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిసతున్నాయి. ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేశామని ప్రభుత్వాలు చెప్పడం. క్షేత్రస్థాయిలో అలాంటి ఏర్పాట్లు పెద్దగా లేకపోవడం గమనించవచ్చు. నేటికీ సమగ్ర వ్యవసాయ విధానంపై కేంద్రం కూడా ఆలోచన చేయడం లేదు. దీనిపై సమగ్రంగా చర్చించాలన్న ధోరణి కానరావడం లేదు. దేశంలోని అన్నదాతలను ఆదుకోవడంతో పాటు.. దేశానికి అన్నం పెట్టాలన్న దూరదృష్టి నేతల్లో కొరవడింది. ఏం చేస్తే దేశంలో ప్రజలందరికి ఆహార ధాన్యాలు దక్కగలవో చర్చించడం లేదు. పంటలు పండుతున్నా అందరికీ ఆహారాధాన్యాలు నేటికీ అందుబాటులోకి రావడం లేదు. సాగుచట్టాలను రద్దు చేసిన తరవాత కూడా ప్రధాని మోడీ ఈ సమస్యల పై చర్చించడం లేదు. అన్నదాతల ఆదాయం రెట్టింపు చేస్తానన్న హామీలు మాటలకే పరిమితం అయ్యాయి. సన్నకారు రైతులకు అండగా ఉన్నానని,ఏటా 6వేల కోట్లు వారి ఖాతాల్లో వేస్తున్నానని ప్రధాని మోడీ గొప్పగా ప్రకటించుకోవడం తప్ప సమగ్ర వ్యవసాయ విధానానికి శ్రీకారం చుట్టడం లేదు. నిజానికి ఖాతాల్లో డబ్బులు వేయడం కాకుండా వ్యవసాయాన్ని ఎలా ముందుకు తీసుకుని వెళ్లాలో ఆలోచించడం లేదు. గ్రామాలను ఆధారం చేసుకుని వ్యవసాయాన్ని పాడి పరిశ్రమను, కోళ్ల పరిశ్రమను ఉమ్మడిగా అభివృద్ధి చేయాలి. దీంతో గ్రామీణ వృత్తులకు కూడా ఆసరా దక్కుతుంది. కానీ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఆ దిశగా ఆలోచన చేయడం లేదు. అకాల వర్షాల కారణంగా భారీగా పంటలు దెబ్బతింటున్న సందర్భంలో వారికి సకాలంలో పరిహారం అందడం లేదు. ప్రభుత్వ లెక్కల ప్రకారం 33 శాతానికంటే ఎక్కువ మొత్తంలో పంటలు దెబ్బతింటేనే నష్టపరిహారానికి సిఫార్సు చేసి ప్రభుత్వానికి నివేదిస్తారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం జరుగుతున్న నష్టం లెక్కల్లోకి రావడం లేదు. పంటనష్టం అంతకు మించి ఉంటేనే వ్యవసాయాధి కారులు వివరాలను సేకరించి ప్రభుత్వానికి నివేదిస్తున్నారు. గత కొన్నేళ్లుగా బీమా చేస్తున్న రైతులకు పరిహారం అందేది నామమాత్రంగానే ఉంటుంది. వేల సంఖ్యలో రైతుల పంట నష్టం జరిగినా, రైతులకు అందుతు న్నది మాత్రం తక్కువగానే ఉంటుంది. వర్షాలు కురియడం,పంటను నష్ట పోవడం కారణంగా రైతులు ఆందోళన చెందుతున్నా అందడం లేదు. బీమా నిబంధనల ప్రకారం నష్టం 33 శాతం దాటితేనే పరిహారం వచ్చే అవకాశం ఉంది. ఈ నిబంధనలను మార్చాల్సి ఉంది. ఇన్సూరెన్స్ ఉన్న రైతులందరికి పరిహారం దక్కడం లేదు. భారీ వర్షాలతో నష్టపోతే రుణాలు తీసుకున్నవారికి ఈ బీమాను అమలు చేయక పోవడంతో రైతులపై అదను భారం పడుతోంది. నిబంధనల ప్రకారం ఐదేళ్ల ఉత్పత్తి ఆధారంగా ఎంత పంటనష్టం జరిగితే అంతే మొత్తాన్ని అందించనున్నారు. అకాల వర్షాలు భారీగా పంట నష్టాన్ని కలిగించి, రైతుకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. చేతికి వచ్చిన పంటను కాపాడు కునేందుకు రైతులు ఎంత ప్రయత్నించినా సాధ్యం కావడం లేదు. అకాల వర్షాల కారణంగా పంటలు దెబ్బతింటున్నాయి. ఈ సమస్యలను అన్నీ చర్చించాలి. తెలుగు రాష్ట్రాల్లో పంట ఏదైనా అమ్ముకోవడం ఓ పెద్ద ప్రహనంగా మారింది. ధాన్యం మార్కెట్లోకి తెచ్చిన తరవాత సవాలక్ష కొర్రీలు పెట్టి రైతులను నిలువుదోపిడీ చేస్తున్నారు. చట్టసభల్లోనూ, బయటా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలనుకనీసంగా చర్చించడం లేదు. ప్రపంచానికి అన్నం పెట్టే స్థితిలో భారతదేశం ఉన్నా..వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు మాత్రం పాలకులు ముందుకు రావడం లేదు. పక్కా మార్కెటింగ్ వ్యవస్థ లేకపోవడం, భారీగా పండుతున్న పంటలను కొనుగోలు చేసే వ్యూహం ప్రదర్శించడం లేదు. పంటల కొనుగోలు సమయంలో సరైన వ్యూహంతో ప్రభుత్వాలు చర్య తీసుకుంటే ఇబ్బందులు రావు. కలెక్టర్లతో ఇటీవల తెలంగాన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్షించి పంటల కొనుగోళ్లకు పక్కాగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎపిలో మంత్రి అచ్చన్నాయుడు కూడా పంటల కొనుగోళ్లకు ఏర్పాట్లు చేశామన్నారు. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు మరోలా ఉన్నాయి. తెలంగాణలో 24 గంటల ఉచిత విద్యుత్...నీటి సరఫరా, రైతుబందు కింద పెట్టుబడి సాయం...రైతు చనిపోతే కుటుంబాన్ని ఆదుకునేందుకు రైతుబీమా పథకం అమలవుతున్నాయి. ఇన్ని పథకాలు ప్రవేశ పెట్టి పంటలు కొనుగోలు చేయకపోతే ఎలా? పంటలు అమ్ముకోవడానికి రైతులు రోడ్డెక్కితే రాజకీయం ఎలా అవుతుంది.? గిట్టుబాటు ధరలు ఇవ్వాలని, పంటలు కొనుగోలు చేయాలని కోరుకోవడం ఏటా ఓ ప్రహసనంగా మారింది. ఇది ఒక్క తెలంగాణ సమస్య కాదు. దేశవ్యాప్తంగా ఉన్న సమస్య. సీజన్ లో సకాలంలో పంటలు కొనుగోలు చేసి డబ్బులు ముట్టచెప్పితే చాలు.. రైతు సమస్యలు సగం తీరినట్లే. కానీ మార్కెట్ యార్డుల్లో పడిగాపులే రైతులను తీవ్ర ఆవేదనకు గురిచేస్తోంది. దానికితోడు గిట్టుబాటు ధరలు రావు. అన్నీవున్నా అల్లుడి నోట్లో శని అన్నట్లుగా కొనుగోళ్ల విషయంలో అటు కేంద్రం, ఇటు రాష్ట్రం పెద్దగా కార్యాచరణ చేపట్టడంలేదు. పంట ఏదైనా డిమాండ్ ఉండదు. అమ్ము కోవడానికి అష్టకష్టాలు పడాల్సిందే. ఇకపోతే దేశంలో సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించేలా ప్రచారం కానరావడం లేదు. కొంతమంది రైతులు ఎరువులు ఎక్కువ వేస్తే దిగుబడి పెరుగుతుందని అనుకోవడం వల్ల మోతాదుకు మించి రసాయన ఎరువులు వాడుతున్నారు. దీంతో భూసారం దెబ్బతింటోంది. అలాగే ప్రజల ఆరోగ్యం కూడా దెబ్బతింటోంది. ఏటా దేశంలో రైతులు పంటలు పండించి గిట్టుబాటు ధరల కోసం రోడ్డెక్కాల్సిన దుస్థితి నెలకొంది. గిట్టుబాటు ధరలు ఇవ్వకుండా ఇతరత్రా తాయిలాలు ప్రకటిస్తూ ప్రభుత్వాలు రైతన్నలను మోసం చేస్తున్నాయి. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని..మార్కెట్‌కు తీసుకుని వచ్చిన పంటలను సకాలంలో కొనుగోలు చేయాలన్న రైతులకు నిరాశే ఎదురవుతోంది. కెసిఆర్ ప్రవేశ పెట్టిన రైతుబంధును ప్రవేశ పెట్టిన కేంద్ర ప్రభుత్వం..పంటల కొనుగోళ్లకు సంబంధించి నిర్దిష్ట విధానాలు అమలు చేయడం లేదు. మార్క్‌ఫెడ్, సిసిఐలు రంగంలోకి దిగినా ఫలితం దక్కడంలేదు. కేంద్ర ప్రభుత్వం ఈ–నామ్ అంటూ అట్టహాసంగా ప్రకటనలు చేసినా రైతులకు మేలు చేకూర్చలేదు. పంటలను గిట్టుబాటుధరకు రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ ఏటా రైతులు రోడ్డెక్కడం.. దాన్ని ప్రభుత్వాలు పట్టించుకోక పోవడం మామూలు విషయంగా మారింది.గిట్టుబాటు ధరలతో పాటు కొనుగోళ్ల కోసం పలుమార్లు ఆందోళనలు చేపట్టినా ప్రభుత్వం నుంచి స్పందన కరువవడంతో రైతులు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. పంటలు మార్కెట్‌కు వచ్చే సమయంలో పక్కాగా కొనుగోళ్లు సాగాలి. గిట్టుబాటు ధరలు దక్కాలి. దళారుల మోసాలు అరికట్టాలి. అప్పుడే కొంతయినా ఊరట దక్కగలదు.

# పోప్ ఫ్రాన్సిస్ కన్నుమూత



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 21 :** వాటికన్ సిటీలో పోప్ ఫ్రాన్సిస్ సోమవారం ఉదయం మృతి చెందారు.కేథలిక్‌ల అత్యున్నత మత గురువు పోప్ ఫ్రాన్సిస్ (88) ఇటలీ కాలమానం ప్రకారం సోమవారం ఉదయం 7.35కు కన్నుమూశారు. ఆయన గత కొంతకాలంగా శ్వాసకోశ సమస్యలు, డబుల్ న్యూమోనియా, కిడ్నీ సమస్యలతో తీవ్రంగా బాధపడ్డారు. ఫిబ్రవరి 14 నుంచి ఆయన 38 రోజుల పాటు ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం గత నెల డిశ్చార్జి అయ్యారు. ఆయన మృతి విషయాన్ని వాటికన్ వర్గాలు ధ్రువీకరించాయి. 2013లో పోప్ బెనిడిక్ట్ తర్వాత ఫ్రాన్సిస్ ఈ బాధ్యతలు చేపట్టారు. ఫ్రాన్సిస్ 1938లో అర్జెంటీనాలో జన్మించారు. దక్షిణ అమెరికా నుంచి ఈ పదవిని అందుకొన్న తొలి వ్యక్తి ఆయనే. తరచూ సామాజిక అంశాలపై కూడా పోపం వ్యాఖ్యలు చేస్తుంటారు. 2016లో రోమ్ బయట ఇతర మతానికి చెందిన శరణార్థుల పాదాలు కడిగారు. దీనిని ఆయన వినయం, సేవాతత్పరతకు చిహ్నంగా భావిస్తారు. పోప్ ఫ్రాన్సిస్ తన మరణానికి కొన్ని గంటల ముందు కూడా ఈస్టర్ పర్వదినాన భక్తులకు సందేశం ఇచ్చారు. వాటికన్ నగరంలోని పీటర్స్ స్క్వేర్‌లో దాదాపు 35,000 మందిని ఉద్దేశించి ఆయన ప్రపంచం కోసం సందేశం ఇచ్చారు. 'బ్రదర్స్ అండ్ సిస్టర్స్, హ్యాపీ ఈస్టర్..!' అని పోప్ స్వయంగా చెప్పారు. అనంతరం ఆయన సందేశాన్ని ఆర్చిబిషప్ డియాగో రావెలి చదివి వినిపించారు. సంక్షోభాలతో రగులుతున్న గాజా, ఉక్రెయిన్, కాంగో, మయన్మార్‌లలో శాంతి నెలకొనాలని ఆకాంక్షించారు. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తన భార్య ఉషతో కలిసి ఈస్టర్ సందర్భంగా పోప్‌ను కలిశారు. ఈ సందర్భంగా పోప్ మూడు పెద్ద చాకొలెట్ ఈస్టర్ ఎగ్స్‌ను వాన్స్ దంపతులకు బహూకరించారు. ఆయన అనారోగ్యం పాలైన తర్వాత అంతమంది జనాల్లోకి రావడం ఇదే తొలిసారి. ప్రత్యేక వాహనంలో ప్రజల మధ్య నుంచి ఆయన ప్రయాణించడం విశేషం. మధ్యలో ఆగి పసికందులను, చిన్నారులను ఆశీర్వదించారు. ఆదివారం జరిగిన ఈస్టర్ వేడుకల్లో సైతం ఆయన పాల్గొన్నారు. ఈ మేరకు వాటికన్ సిటీ–వర్గాలు వెల్లడించాయి. పోప్ ఫ్రాన్సిస్ తన 12 ఏళ్ల వయస్సు నుంచే చర్చి, సమాజం, అట్టడుగు వర్గాల కోసం అంకితభావంతో పని చేశారు. 1936,డిసెంబర్ 17వ తేదీన అర్జెంటీనాలో పోప్ ఫ్రాన్సిస్ జన్మించారు. 2013 మార్చి 13న 266వ పోప్‌గా ఫ్రాన్సిస్ ఎంపికయ్యారు. ఆయన మృతి పట్ల ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పోప్ ఫ్రాన్సిస్ మృతికి ఆయన సంతాపాన్ని తెలిపారు. ఆయన మరణం తనను తీవ్రంగా కలత పెట్టిందన్నారు. భారత ప్రజలపై పోప్ ఫ్రాన్సిస్ ప్రేమాభిమానాలు నిత్యం నిలిచి ఉంటాయని ఆయన వ్యాఖ్యానించారు. కాథలిక్ సమాజానికి ఈ సందర్భంగా ఆయన తన సంతాపాన్ని తెలిపారు. అలాగే చిన్ననాటి నుంచి క్రీస్తు ఆదర్శాలను పోప్ ఫ్రాన్సిస్.. తనను తాను అంకితం చేసుకున్నారని వివరించారు. పేదలు, అణగారిన ప్రజలకు ఆయన సేవలందించారని గుర్తు చేశారు. దేవుని ఆలింగనంలో ఆయన ఆత్మకు శాశ్వత శాంతి లభిస్తుందని ఈ సందర్భంగా ప్రధాని మోదీ విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా 1.4 బిలియన్ల మంది కాథలిక్కులు.. పోప్ ఫ్రాన్సిస్‌ను ఆరాధిస్తున్న సంగతి తెలిసిందే. గతేడాది ఇటలీలో జీ7 శిఖరాగ్ర సమావేశం జరిగింది. ఈ సమావేశం వేదికగా పోప్‌ను ప్రధాని మోదీ కలిసి సంగతి తెలిసిందే. అలాగే పోప్ ఫ్రాన్సిస్‌తో తనకు ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా ప్రధాని మోదీ గుర్తు చేసుకున్నారు. పోప్ మరణ వార్త ఇప్పుడే తెలిసింది. నేను ఆయన్ను నిన్నే కలిశాను. కొవిడ్ తొలినాళ్లలో ఆయన ప్రసంగాలను నేను మర్చిపోలేను. అవి చాలా అద్భుతమైనవని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ అన్నారు. పోప్ ఫ్రాన్సిస్ మరణానికి ప్రపంచం సంతాపం తెలియజేస్తోంది. విధివంచితుల విషయంలో ఆయన ప్రేమ, మానవత్వం కేథలిక్ ప్రపంచానికి వెలుపల కూడా కొన్ని లక్షల మందిని ప్రభావితం చేసిందని ఐరోపా సమాఖ్య అధ్యక్షురాలు ఉర్సులా వాన్‌డెర్ లెయెన్ అన్నారు. పోప్ ఫ్రాన్సిస్ మరణం ప్రపంచానికి తీరని లోటు–. ఆయన కరుణ, ప్రేమకు ప్రతిరూపం. సత్యం కోసం ఎప్పుడూ నిలబడ్డారు. అన్యాయాలపై నిర్భయంగా మాట్లాడారు. పేదలు, అణగారిన వర్గాలపై చాలా శ్రద్ధ చూపించారు. మరింత శాంతియుత, దయామయ ప్రపంచాన్ని కోరుకొనే లక్షల మందికి ఆయనో స్ఫూర్తిదాత అని ప్రియాంకా గాంధీ వాద్రా అన్నారు. పోప్ ఫ్రాన్సిస్ మృతి మానవాళికి తీరని లోటు–. ఆయన మహోన్నత ఆధ్యాత్మిక వ్యక్తి. తన జీవితాన్ని చర్చి, మానవాళి సేవకు అంకితం చేశారు. సామాజిక న్యాయం కోసం అవిశ్రాంత కృషి చేశారు. ప్రపంచ శాంతి స్థాపకుడిగా పోప్ ఫ్రాన్సిస్ పాత్ర అద్భుతం అని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. పోప్ ఫ్రాన్సిస్ మృతి నన్ను ఎంతో బాధించింది. ఆధ్యాత్మిక నాయకుడిగా కోట్ల మందిలో స్ఫూర్తి నింపారు. శాంతి సందేశంగా నిలిచారు. ఆంధ్రప్రదేశ్ ప్రజల తరఫున ప్రపంచ క్యాథలిక్ కమ్యూనిటీకి ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నానని ఏపీ సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## హెలికాప్టర్ గాలికి..

**నిజామాబాద్, ఏప్రిల్ 21 :** నిజామాబాద్‌లో సోమవారం రైతు మహోత్సవ సభ సందర్భంగా గందరోళం చెలరేగింది. సభ ప్రాంగణం పక్కనే హెలికాప్టర్ ల్యాండింగ్ కావడంతో హెలికాప్టర్ గాలికి టెంట్లు కూలాయి. గాలి దుమారంతో స్వాగత తోరణం కూలింది. హెలికాప్టర్‌లో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, టీపీసీసీ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్, షబ్బీర్ అలీ ఉన్నారు. హెలికాప్టర్ గాలికి సభా ప్రాంగణం నుంచి రైతులు పరుగులు పెట్టారు. సభలో స్వల్ప తొక్కిసలాట జరిగింది. గాలి, దుమ్ము ఒకేసారి రావడంతో సభలో కొంతసేపు అలజడి నెలకొంది.

## భారత్ చేరుకున్న జెడి వాన్స్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 21:** భారత పర్యటనకు వచ్చిన అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ దిల్లీ వేదికగా ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయ్యారు. ఇరునేతల మధ్య వాణిజ్యం, సుంకాలు, ప్రాంతీయ భద్రతతోపాటు పలు ద్వైపాక్షిక అంశాలు చర్చకు రానున్నట్లు– సమాచారం. అమెరికా ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత జేడీ వాన్స్ భారత్ పర్యటనకు రావడం ఇదే తొలిసారి. ఆయన వెంట భార్య ఉషా వాన్స్, ముగ్గురు పిల్లలతో పాటు– ఆ దేశ ఉన్నతస్థాయి ప్రతినిధులు ఉన్నారు. సోమవారం ఉదయం దిల్లీలో దిగిన జేడీ వాన్స్ దంపతులకు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్, ఇతర అధికారులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వాన్స్ పిల్లలు మీడియా దృష్టిని ఆకర్షించారు. కుమారులు ఇవాన్, వివేక్, కుమార్తె మీరాబెల్ భారతీయ సంప్రదాయ దుస్తుల్లో కన్పించారు. అనంతరం వారు దిల్లీలోని అక్షర్‌ధామ్ ఆలయాన్ని సందర్శించారు. భేటీ అనంతరం వాన్స్ దంపతులు, అమెరికా అధికారులకు ప్రధాని మోదీ ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు. ట్రంప్ టారిఫ్ దూకుడు వేళ.. ఈ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది.

## ప్రజాసంక్షేమం పరమావధి

### ప్రజల జీవితాలు ప్రభావితం చేసేలా చర్యలు.. సివిల్ సర్వీసెస్ డేలో ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 21 :** తమ ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు దేశ ప్రజల వెయ్యేళ్ల భవిష్యత్తును ప్రభావితం చేస్తాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. తాము తసీఉకుంటున్న నిర్ణయాలు దేశాభివృద్ధిని కాంక్షించి తీసుకుంటున్నాయేనని అన్నారు. సమగ్ర అభివృద్ధి అంటే దేశంలోని ఏ గ్రామం, కుటుంబం, ఒక్క పౌరుడు కూడా వెనకబడి ఉండకూడదని అర్థం. ఎన్డీయే ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజల వెయ్యేళ్ల భవిష్యత్తుపై సానుకూల ప్రభావం చూపుతాయనడంలో సందేహం లేదన్నారు. టెక్నాలజీ పరుగులు తీస్తున్న ఈ కాలంలో పరిపాలన అంటే వ్యవస్థలను నిర్వహించడం కాదని వ్యాఖ్యానించారు. రాబోయే అవకా శాలను కూడా అంచనా వేయగలగాలని పేర్కొన్నారు. సివిల్ సర్వీసెస్ డే సందర్భంగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దేశ యువత, రైతులు, మహిళల ఆకాంక్షలు నెరవేర్చుతూ ఉన్నతస్థాయికి ఎదిగేందుకు ఉపయోగపడతాయి. వారి అసాధారణ ఆకాంక్షలు నెరవేర్చ డానికి సాధారణంగా కృషి చేస్తే సరిపోదు. అంతే వేగంతో ప్రభుత్వం పని చేయాల్సి ఉంటుందని ప్రధాని పేర్కొన్నారు. టెక్నాలజీ పరుగులు తీస్తున్న ఈ కాలంలో పరిపాలన అంటే వ్యవస్థలను నిర్వహించడం కాదు. కొత్త అవకాశాలు సృష్టించడం. పథకాలు ప్రజలపై ఎంత ప్రభావం చూపుతాయనేది కీలకం. దాని ఆధారంగా నాణ్యమైన పాలన కొనసాగించడం సాధ్యమవుతుంది. ఈ పదేళ్లలో భారత్‌లో ఎన్నో మార్పులు జరిగాయి. పాలన పారదర్శకత, ఆవిష్కరణ ఇలా ఎన్నో రంగాల్లో కొత్త మార్క్‌ను నెలకొల్పుతోందని అన్నారు. 2023లో జీ20 భారత్ అతిథ్యమిచ్చిన సంగతి తెలిసిందే. నాడు 'జనభాగి దారి' విధానం ఈ కార్యక్రమాన్ని ప్రజా ఉద్యమంగా మార్చింది. యావత్ ప్రపంచ దృష్టి మన దేశంపై పడింది. కార్యక్రమాల్లో పాల్గొనడం మాత్రమే కాదు.. పలు కార్యక్రమాలను నడిపించే స్థాయికి మన దేశం చేరింది. అగ్రగామిగా నిలుస్తోంది. ఈసందర్భంగా సివిల్ సర్వెంట్లకు ఓ విజ్ఞప్తి చేయాలనుకుం టున్నా. పేదల సమస్యలను ఓపిగ్గా వినండి. వారితో సున్నితంగా వ్యవహరించండి. వారిని గౌరవించండి. పేదల సమస్య పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

# అమెరికా వేదికగా ఈసీపై రాహుల్ ఆరోపణలు

### మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలపై వ్యాఖ్య

### రాహుల్ తీరుపై భగ్గుమన్న బిజెపి

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 21:** భారత ఎన్నికల కమిషన్ పూర్తిగా రాజీ పడిందని రాహుల్ గాంధీ అమెరికాలో ఓ కార్యక్రమంలో ఆరోపించారు. మహారాష్ట్ర ఎన్నికల్లో హాజరైన వోటర్ల గణాంకాలను రాహుల్ ఉటంకిస్తూ ఎన్నికల కమిషన్‌పై విరుచుకుపడ్డారు. యుఎస్ చేరుకున్న రాహుల్ గాంధీ ఆదివారం బోస్టన్‌లో ఒక కార్యక్రమంలో ఆ వ్యాఖ్యలు చేశారు. మామూలుగా చెప్పాలంటే మహారాష్ట్రలో ఉన్న వయోజనుల సంఖ్య కన్నా అధికంగా అసెంబ్లీ ఎన్నికల్లో వోట్లు పడ్డాయని లోక్‌సభలోని ప్రతిపక్ష నాయకుడు రాహుల్ ఆరోపించారు. ఎన్నికల కమిషన్ మాకు సాయంత్రం 5.30 గంటలకు వోటింగ్ గణాంకాలు ఇచ్చింది. సాయంత్రం 5.30 గంటలు, రాత్రి 7.30 గంటల మధ్య 65 లక్షల మంది వోటర్లు వోటు–వేశారు. అలా జరగడం భౌతికంగా అసాధ్యం. ఒక వోటర్ వోటు– వేయడానికి సుమారు మూడు నిమిషాలు పడుతుంది. మీరు లెక్క వేస్తే తెల్లవారు జామున 2 గంటల వరకు వోటర్ల లైన్లు ఉన్నాయని అర్థం. కానీ అది జరగలేదు' అని ఆయన చెప్పారు. 'మేము వీడియోగ్రఫీ కోసం అడిగినప్పుడు వారు నిరాకరించడమే కాకుండా మేము వీడియోగ్రఫీ కోసం అడిగే వీలు లేకుండా చట్టాన్ని కూడా మార్చారు' అని రాహుల్ ఆరోపించారు. 'ఇసి రాజీ పడిందనేది సుస్పష్టం. వ్యవస్థతోనే ఏదో లోపం ఉందనేది కూడా సుస్పష్టం. నేను ఇది ఎన్నో సార్లు చెప్పాను' అని రాహుల్ తెలిపారు. నిరుడు నవంబర్‌లో జరిగిన మహారాష్ట్ర ఎన్నికల్లో బిజెపి శివసేన ఎన్‌సిపి కూటమి మహాయుతి కాంగ్రెస్, ఎన్‌సిపి(ఎస్‌పి), శివసేన (యుబిటి)తో కూడిన మహా వికాస్ అఘాడి (ఎంవిఎ) కూటమిని చిత్తు చేసింది. రాహుల్ ఆరోపణలకు బిజెపి తీవ్రంగా స్పందించింది. రాహుల్‌ను ఒక 'దేశద్రోహి'గా బిజెపి అభివర్ణించింది. నేషనల్ హెరాల్డ్ కేసులో ఇడి చర్యతో ఆయన విమర్శను బిజెపి ముడిపెట్టింది. రాహుల్ విదేశీ గడ్డపై దేశీయ వ్యవస్థలను 'అవమానించడమే' కాకుండా, అవినీతికి కూడా పాల్పడ్డారని పార్టీ ఆరోపించింది. ఈసీపై రాహుల్ వ్యాఖ్యలను బిజెపి ఎంపి, జాతీయ అధికార ప్రతినిధి సంబిత్ పాత్రా తీవ్రంగా ఆక్షేపిస్తూ, నేషనల్ హెరాల్డ్ కేసులో ఇడి చర్యపై ఆగ్రహాన్ని ఆయన ఇసిపై వెళ్లగక్కుతున్నారని ఆరోపించారు. 'అలా చేయడం వల్ల ఏమీ జరగదు. ఇడి మిమ్మల్ని వదలిపెట్టదు. సంస్థలు వాస్తవాల ఆధారంగా పని చేస్తుంటాయి, నేషనల్ హెరాల్డ్ వ్యవహారం అందరికీ తెలిసినదే. నేరం దృష్టా మీరు,



మీ తల్లి అరెస్టయి జైలుకు వెళతారు' అని సంబిత్ పాత్రా ఢిల్లీలో బిజెపి ప్రధాన కార్యాలయంలో విలేకరుల గోష్ఠిలో చెప్పారు. 'విదేశీ భూభాగంపై భారతీయ సంస్థలను, భారతీయ ప్రజాస్వామ్యాన్ని మీరు అవమానిస్తున్నందుకే కాకుండా నేషనల్ హెరాల్డ్ కేసులో కోట్లాది రూపాయల దేశం సొమ్మును మీరు, మీ తల్లి స్వాహా చేసినందుకు కూడా మీరు దేశద్రోహి. మీరు, మీ తల్లి దీనితో తప్పించుకుపోలేరు' అని పాత్రా అన్నా రు. రూ.988 కోట్ల మేరకు దుర్వినియోగం చేశారని ఆరోపిస్తూ నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ఇతరులపై ఇడి న్యూఢిల్లీలోని ఒక ప్రత్యేక కోర్టులో ఇటీ–వల ఒక చార్జిషీట్ దాఖలు చేసిం ది. మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్ఎ)లోని వివిధ సెక్షన్ల కింద కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలను నంబర్ 1, 2 నిందితులగా పేర్కొంటూ ప్రాసిక్యూషన్ ఈ నెల 9న ఫిర్యాదు దాఖలు చేసింది. రాహుల్ గాంధీ శనివారం రాత్రి బోస్టన్ చేరుకుని వాణిజ్యవేత్తలు, భారతీయ సమాజం సభ్యులతో సమాలోచనలు ప్రారంభించారు. ఆయన రోడ్ ఐలాండ్‌లోని బ్రౌన్ విశ్వవిద్యాలయాన్ని సందర్శిస్తారు. రాహుల్ అక్కడ ప్రసంగించి, ఫ్యాకల్టీ, విద్యార్థులతో ముఖాముఖి సాగిస్తారు.

ప్రజా దీవెన
నవ సమాజ సంక్షేమం మా సంకల్పం...



# పేదోడి కన్నీళ్లు తుడిచేందుకే భూభారతి

**నెలాఖరునాటికి పైలెట్ ప్రాజెక్టు పూర్తి**
**జూన్ 2 నుండి మండలాలలో వ్యవసాయ భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం**
**9.26 లక్షల సాదాబైనామా దరఖాస్తులు**
**న్యాయమైన వాటికి పరిష్కారం చూపుతాం**
**రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

**ప్రజాదీవెన నల్గొండ :** భూ భారతి ద్వారా సాగులో ఉన్న ప్రతి రైతుకు న్యాయం జరుగుతుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. భూభారతి పేదలు, బడుగు, బలహీన వర్గాలు, రైతులకు, భూములున్న ఆసాముల కోసం తీసుకొచ్చిందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన తెలంగాణ భూ భారతి- 2025 చట్టంపై నిర్వహిస్తున్న అవగాహన సదస్సులలో భాగంగా సోమవారం నల్గొండ జిల్లా, చందంపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మంత్రి మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికై రాష్ట్రంలోని 4 మండలాలను పైలెట్ ప్రాజెక్టు కింద తీసుకోవడం జరిగిందని, ఈ నెలాఖరునాటికి ఈ పైలెట్ ప్రాజెక్టు పూర్తవుతుందని, జూన్ 2 నుండి ఈ పైలెట్ మండలాలలో వ్యవసాయ భూముల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించనున్నామని తెలిపారు. మే 1 నుండి అన్ని జిల్లాలలో ఒక మండలాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద తీసుకోనున్నామని, అత్యంత వెనుకబడిన చందంపేట మండలాన్ని కూడా పైలెట్ మండలంగా తీసుకునే విషయమై ఆలోచిస్తామని తెలిపారు. జూన్ 2 నుండి ప్రతి గ్రామానికి తహసిల్దార్ స్థాయి అధికారులు గ్రామానికి వచ్చి భూ సమస్యల పై దరఖాస్తులు తీసుకుంటారని, రైతులు ఒక రూపాయి కూడా చెల్లించకుండా రెవెన్యూ సమస్యలను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. రైతుల భూముల సర్వే కోసం 6 వేల మంది లైసెన్స్ సర్వేయర్లను నియమించనున్నామని, ప్రతి గ్రామానికి ఒక గ్రామ పరిపాలన అధికారి చొప్పున 10695 మందిని వచ్చే నెల మొదటివారం నుండి పంపించనున్నామని ఆయన వెల్లడించారు. ప్రతి మనిషికి ఆధార్ లాగే భూదార్ కార్డు ను ఇచ్చి ఖాతా నెంబర్ ను ఇవ్వనున్నమన్నారు. గతంలో భూములు అమ్మిన, కొన్న మ్యాపింగ్ లేదని, ఇకపై రాష్ట్రవ్యాప్తంగా భూమి రిజిస్ట్రేషన్ సమయంలోనే సర్వే మ్యాప్ ను తప్పనిసరిగా ఏర్పాటు చేసేలా చట్టంలో తీసుకురావడం జరిగిందని వెల్లడించారు. సాదా బైనామాలకు ధరణిలో ఎలాంటి అవకాశం లేదని,భూ భారతిలో దీనిని పరిష్కరించనున్నామని, తొమ్మిది లక్షల 26 వేల సాదా బైనామా దరఖాస్తులున్నాయని, వాటిలో న్యాయమైన వాటిని పరిష్కరిస్తామని తెలిపారు. ప్రతి పేద వాడి కన్నీళ్లు తుడిచేందుకు తీసుకువచ్చిన చట్టం భూ భారతి చట్టం అని, ఈ చట్టాన్ని అధికారులు పకడ్బందీగా అమలు చేయాలని, చట్టాన్ని బాగా అమలు చేసి ప్రజలకు ఉపయోగపడే చుట్టంగా చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. గతంలో పట్టాలిచ్చిన డి లిమిటేషన్ ఫారెస్ట్ భూములను పరిశీలించి, ఎవరికి ఎంత భూమి ఉందో నిజంగా సాగులో ఉన్న రైతులకు పట్టాలు ఇస్తామని తెలిపారు. పునరావాసకాలనీల ఏర్పాటు సందర్భంగా, ఒక చోట నుండి మరోచోటికి రైతులు వెళ్లిన సందర్భంలో రైతులకు ఇచ్చిన భూముల డీ లిమిటేషన్ విషయంలో ఇప్పటివరకు ఇబ్బందులు పడ్డారని, అలాగే డీ నోటిఫికేషన్ భూముల విషయంలో కూడా ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ధరణి సమయంలో ప్రభుత్వం వద్దకు ప్రజలు వెళ్లాల్సి వచ్చేదని, వీటన్నిటికీ పూర్తిగా న్యాయం జరిగేలా భూ భారతి లో ప్రణాళికలు రూపొందించడం జరిగిందని ఆయన తెలిపారు. తమది సమస్యలను పరిష్కరించే ప్రభుత్వమని చేతల ద్వారా నిరూపిస్తున్నామని మంత్రి వెల్లడించారు.

**ఎమ్మెల్యే మాట్లాడుతూ...**

సమావేశానికి అధ్యక్షత వహించిన స్థానిక శాసనసభ్యులు బాలునాయక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి 100 సంవత్సరాలు పనికొచ్చేలా భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందని, చందంపేట మండలంలోని పలు గ్రామాలలో అటవీ భూములకు పట్టాలిచ్చారని, అయితే గడచిన పదేళ్లలో రైతులు చాలా సమస్యలను ఎదుర్కొన్నారని, వీటన్నిటికీ ఎంజాయ్ మెంట్ సర్వే చేసి నిజమైన హక్కుదారులకు పట్టాలు ఇవ్వాలని, అలాగే డి ఫారెస్ట్ అసైన్డ్ భూముల సమస్యలు ఉన్నాయని, తిరుమలగిరి సాగర్ లాగే చందంపేట మండలాన్ని పైలెట్ మండలంగా తీసుకొని ఇక్కడి సమస్యలను పరిష్కరించాలని మంత్రిని విజ్ఞప్తి చేశారు. దేవరకొండ నియోజకవర్గం లో ఎస్సీ, ఎస్టీలు ఎక్కువగా ఉన్నందున అదనపు కోటా కింద ఎక్కువగా ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని మంత్రిని కోరారు. ఎస్ఎల్బీసీ టన్నెల్ పనులు పూర్తి చేయడంతో పాటు, డిండి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నియోజకవర్గంలోని భూములకు సాగునీటి తీసుకొస్తామన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 1800 కోట్లతో ఏదుల నుండి డిండి లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు టెండర్లు పూర్తి చేయడం జరిగిందని, దీని ద్వారా లక్ష 50 వేల ఎకరాలకు సాగునీరు వస్తుందని, దీంతో పాటు, చిన్న చిన్న లిఫ్టులన్నిటిని పూర్తి చేస్తామన్నారు.

**ఎమ్మెల్సీలు మాట్లాడుతూ...**

ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ ఇచ్చిన వాగ్దానం మేరకు రాష్ట్ర ప్రభుత్వం ధరణి స్థానంలో భూభారతి తీసుకువచ్చిందని, దీంతోపాటు, పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రభుత్వ అమలు చేస్తున్నదని, వీటన్నిటిని వినియోగించుకోవాలని కోరారు. శాసనమండలి సభ్యులు నెల్లికంటి సత్యం మాట్లాడుతూ ధరణిలో అనేక సమస్యలు ఉండేవని సాగు కాలాన్ని తీసివేశారని, అలాగే కొన్ని గ్రామాలు ధరణిలో బ్లాక్ చేయడం జరిగిందని, వీటన్నిటిని పరిష్కరించేందుకు భూ భారతి తీసుకు వచ్చిందని, డీ ఫారెస్ట్ భూములు పరిష్కరించే దిశగా ఆలోచించాలని, నల్గొండ జిల్లాలో సర్వేయర్లు తక్కువగా ఉన్నందున మండలానికి ఒక సర్వేయర్ ను నియమించాలని, క్షేత్రస్థాయిలో పరిశీలించి భూమిపై ఉన్న వారికె పట్టాలు ఇవ్వాలని, సాగు చేసుకుంటున్న వారికి పట్టాలు ఇవ్వాలని, భూభారతి పై విస్తృత ప్రచారం కల్పించాలని కోరారు.

**కలెక్టర్ మాట్లాడుతూ...**


జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ అందరికీ మేలు జరిగేలా భూ భారతిని తీసుకురావడం జరిగిందని తెలిపారు. 2020లో వచ్చిన ధరణి వల్ల చందంపేట మండలంలోని 6 గ్రామాలు బ్లాక్ లో ఉన్నాయని, భూ భారతి ద్వారా వాటిని పరిష్కరించే అవకాశం ఇప్పుడు ఉందన్నారు. మోఖ మీద ఉన్న వారి పేరును భూ భారతి ద్వారా ఎక్కించే బాధ్యత రెవెన్యూ శాఖదేనిని, భూభారతి ద్వారా తహసిల్దార్ ద్వారా అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. రిజిస్ట్రేషన్ కు దరఖాస్తు చేసుకున్న 30వ రోజు పని పూర్తవుతుందని, ఒకవేళ కానట్లయితే 31వ రోజు ఆటోమేటిక్ గా అవుతుందన్నారు. ఈ అధికారాలు ఆర్డీవోకు ఉన్నాయని, ఉచిత న్యాయ సహాయం ఏర్పాటు చేసే అవకాశం, సంవత్సరానికి ఒకసారి భూమి రికార్డులను అప్డేట్ చేసె అవకాశం భూ భారతి లో ఉన్నాయని కలెక్టర్ వేల్లడించారు. చందం పేట మండలంలో ఎంజాయ్ మెంట్ సర్వే నిర్వహించాల్సిన అవసరం ఉందని మంత్రికి విజ్ఞప్తి చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ మాధవరెడ్డి, జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్, దేవరకొండ అదనపు ఎస్ పి మౌనిక, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

## కతాల్ గూడ లో బడి బాట ర్యాలీ



**ప్రజాదీవెన నల్గొండ టౌన్ :** నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయుల చేత నాణ్యమైన విద్యను అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు చేర్పించాలని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ దండెంపల్లి సరోజ అన్నారు. సోమవారం నల్గొండ పట్టణంలోని 11వ వార్డు కతాల్ గూడ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి ఆధ్వర్యంలో విద్యార్థులు వార్డు పెద్దలు కలిసి అర్బన్ కాలనీలో బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సరోజ మాట్లాడుతూ విశాలమైన ఆట స్థలం, ఆకర్షణీయమైన తరగతి గదులు, ప్రతి తరగతి గదిలో ఫ్యాను,డ్యూయల్ డెస్క్ లు, పచ్చని చెట్లు కలిగిన ఆహ్లాదకరమైన వాతావరణం , ఇంగ్లీష్ మీడియం స్కూల్ కతాల్ గూడెం లో ఉండడం అభినందనీయమని అన్నారు. నవోదయ, గురుకుల ఇతర పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుంద ని,వారానికి మూడుసార్లు రాగి జావా, మూడు కోడిగుడ్లతో పౌష్టికాహారం మధ్యాహ్నం భోజన సదుపాయం, యూనిఫామ్, పుస్తకాలు నోట్ బూక్ లు ప్రభుత్వ పాఠశాలలో అందజేయడం జరుగుతుందని అన్నారు. అన్ని సౌకర్యాలతో కూడిన ఎలాంటి ఫీజులు లేకుండా ఉచిత నిత్యం అందించే ప్రభుత్వ ఇంగ్లీష్ మీడియం పాఠశాల మన చెంత నుండగా వేలకు వేల ఫీజులు కట్టి ప్రవేటు పాఠశాలకు పంపవలసిన అవసరం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు పెద్దలు, మాజీ కౌన్సిలర్లు దండంపల్లి సత్తయ్య, కంకణాల నాగిరెడ్డి, పజ్జూరి పరమేష్, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, ఎస్ కె. రఫీ, ఉపాధ్యాయులు చంద్ బీ, కే.రాణి, రాజశేఖర్, భవాని, మధు అంగన్వాడి టీచర్ రమాదేవి, ఆర్ పి. మమత,తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మస్థైర్యమే గెలుపు కిరీటం




**సచిన్ తెందుల్కర్... క్రికెట్ చరిత్రలో తనకంటూ ఒక పేజీ రాసుకున్న వ్యక్తి.. పదో తరగతిలో తప్పారు. కానీ ఆసక్తి ఉన్న క్రికెట్ లో తనే ఒక మైలురాయిలా నిలిచారు.**

**థామస్ ఆల్వా ఎడిసన్... విద్యుత్తు బల్బును కనుగొన్న వ్యక్తి.. బడిలో అభ్యసనా సామర్థ్యాల్లో వెనుకబడ్డారు.. ఉపాధ్యాయులు ఇంటికి పంపించారు. పలుమార్లు ప్రయత్నించి మనం చూస్తున్న విద్యుత్తు బల్బును కనుగొన్నారు.**

**ప్రపంచంలోని చాలా మంది ఆత్మవిశ్వాసంతో ముందుకు వచ్చిన వారే.. వారి స్ఫూర్తితో విద్యార్థులు ముందుకు సాగాలి.**

**ప్రజాదీవెన నల్గొండ బ్యూరో :** ఆత్మస్థైర్యం.. సాధించాలన్న తపన ఉంటే చాలు.. ఎంతటి కష్టాలనైనా ఎదుర్కోవచ్చు. పరీక్షలు.. మార్కులు.. ర్యాంకులే మన భవిష్యత్తు కాదు.. జీవితంలో మార్కులే పరమావధి కాదు. తక్కువ మార్కులు వచ్చినా.. ఫెయిల్ అయినా జీవితం ముగిసిపోదు.. నిరాశ చెందకుండా మరింత ఆత్మస్థైర్యంతో ముందుకు సాగితే విజయం పాదక్రాంతం కావడం ఖాయం. నేడు ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలు విడుదల కాబోతున్నాయి.. విద్యార్థులు మార్కులు తక్కువ వచ్చాయనో.. ఉత్తీర్ణత కాలేదనో.. కుంగిపోకుండా ధైర్యంగా మరింత ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి. ప్రపంచంలోని చాలా మంది ఆత్మవిశ్వాసంతో ముందుకుసాగితే విజయం పాదక్రాంతం కావడం ఖాయం.

**ఒక్క ఫోన్ కాల్.. మనసుకు ఉపశమనం...**

ప్రజల మానసిక ఆరోగ్యాన్ని కాపాడటానికి కేంద్రం 'టెలీమానస్'ను తీసుకొచ్చింది. టెలీ మెంటల్ హెల్త్ అసిస్టెన్స్ అండ్ నెట్వర్కింగ్ అక్రాస్ స్టేట్స్ (టెలీమానస్)కు దేశవ్యాప్తంగా 14416 లేదా 1800 8914416 టోల్ ఫ్రీ నంబరు కేటాయించారు. పరీక్షల ఒత్తిడి, కుటుంబ సమస్యలు, ఆత్మహత్య ఆలోచనలు, మద్యం వ్యసనాలు, ఇతర మానసిక ఆరోగ్య సమస్యలు ఉన్నవారు టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేయొచ్చు.

ఆ నంబరుకు ఫోన్ చేస్తే ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టం (ఐవీఆర్ఎస్) ద్వారా భాషను ఎన్నుకున్నాక... ఆ భాషలోని సుశిక్షితులైన కౌన్సిలర్ కు కనెక్ట్ చేసి మాట్లాడిస్తారు. సైకియాట్రిక్ వైద్య నిపుణులున్న కేంద్రానికి సిఫార్సు చేస్తారు. ఒకవేళ వ్యక్తిని ప్రత్యక్షంగా ఇంటివద్దే కలవాల్సి ఉంటే ప్రాథమిక వైద్య సిబ్బందికి సందేశం పంపిస్తారు.

ఈనెల, వచ్చే నెలలో పలు పరీక్ష ఫలితాల విడుదల అవుతాయి. ఫలితాల తేదీలు సమీపిస్తున్నకొద్దీ విద్యార్థుల్లో ఒత్తిడి పెరుగుతూ ఉంటుంది. అందుకే టెలీమానస్ కు ఫోన్ చేసి విద్యార్థులు మానసిక ఒత్తిడిని దూరం చేసుకోవచ్చు.

**డ్రాపౌట్ విద్యార్థి ఒరాకిల్ సంస్థ అధిపతి....**

ఒరాకిల్ డేటా బేస్ సాఫ్ట్వేర్ సంస్థను స్థాపించిన ల్యారీ ఎలీస్ రెండు విశ్వవిద్యాలయాల నుంచి డ్రాపౌట్ అయిన విద్యార్థి.. పరీక్షల్లో ఫెయిల్ కావడం.. చదువంటే పెద్దగా ఆసక్తి లేకపోవడంతో ఆయన డ్రాపౌట్ అయ్యారు.. నీవెందుకు పనికిరావంటూ ఆయన పెంపుడు తండ్రి ఎప్పుడూ చివాట్లు పెట్టేవారట.. అయినా ఏమాత్రం నిరాశ చెందలేదు.. కంప్యూటర్ రంగంలో రాణించి ఒరాకిల్ సంస్థను స్థాపించి ఎందరికో మార్గదర్శకుడయ్యారు.

**చదువు మానేసి ఫేస్ బుక్ రూపొందించి...**

ప్రస్తుతం ఫేస్ బుక్ అంటే తెలియని వారెవరూ ఉండరు. సామాజిక మాధ్యమాల్లో అత్యంత ఆదరణ పొందిన యాప్ ఇది. దీనిని రూపొందించిన జుకర్బర్గ్ చదువు మధ్యలో మానేసినవారే. ఆయన హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో చదువుతుండగా.. పాఠ్యాంశాలు సరిగా అర్థంకాక మధ్యలోనే మానేశారు. ప్రోగ్రామింగ్ అంటే ఆయనకు చాలా ఇష్టం కావడంతో శిక్షణ పొంది సృజనాత్మకతతో ముందుకు సాగి విజయం సాధించారు. ఇలాంటి వారిని ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు మరింతగా ముందుకు సాగాలి.

## భూ భారతి చట్టం శాశ్వత పరిష్కారం..

**ఆధార్ లా భూధార్...**
**గ్రామ స్థాయి లో గ్రామ రికార్డులు నిర్వహణ..**
**జిల్లా కలెక్టర్ తెజస్ నంద్ లాల్ పవార్**




**ప్రజాదీవెన, సూర్యాపేట :** భూ భారతి చట్టం-2025 ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిస్కారం లభిస్తుందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. సోమవారం కోదాడ పట్టణంలోని ఆర్ ఎస్ వి పంక్షన్ హాల్, అనంతగిరి మండలం శాంతినగర్ ఎస్ డబ్ల్యు సి గోదాం నందు భూ భారతి చట్టం 2025 పై అవగాహన సదస్సు కార్యక్రమంను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ముందుగా తెలంగాణ రాష్ట్ర జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూ భారతి చట్టం, చట్టం అమలుకు తక్కువ కాలంలోనే నియమాలు రూపొదించటం, చట్టం అమలు పర్యటానికి క్షేత్ర స్థాయి అధికారులు ఏర్పాటు, భూ సమస్యలను దరఖాస్తు చేసుకొనుటకు భూ భారతి పోర్టల్ సమస్య లను పరిష్కరించేందుకు అధికారుల అధికారాలు అనే నాలుగు మూల స్తంబాల ద్వారా సమస్యలు పరిష్కరించేందుకు తెలంగాణ ప్రభుత్వం డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ గారి జయంతి ఏప్రియల్ 14 రోజున భూ భారతి చట్టం అమలులోనికి తీసుకొని రావటం జరిగిందని తదుపరి రాష్ట్ర స్థాయి లో, జిల్లా స్థాయి లో రెవిన్యూ సిబ్బందికి అవగాహన కల్పించటం జరిగిందని ఇప్పుడు మండల స్థాయి లో ప్రజలకి చట్టం పై అవగాహన తెచ్చేందుకు 23 మండలాలలో ప్రజలకి సమస్యలు ఎలా పరిష్కరించాలో,అవగాహన సదస్సు లు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ధరణిలో చాలా సమస్యలు పరిష్కరించలేనివి ఉన్నాయని ప్రతి సమస్యని కలెక్టర్ ద్వారా గానీ కోర్టు ద్వారా గానీ పరిష్కరించే విధంగా ఉండేదని ప్రతి ఒక్కరు గ్రామం నుండి సూర్యాపేట వచ్చి సమస్య పై దరఖాస్తు ఇవ్వాలంటే ప్రజలకి చాలా ఇబ్బందిగా ఉండేదని కానీ భూ భారతి చట్టం ద్వారా అధికారం వికేంద్రికరణ జరుగుతుందని సమస్యని బట్టి తహసీల్దార్, ఆర్ డి ఓ, కలెక్టర్ స్థాయి లో పరిష్కరించవచ్చు అని త్వరలో గ్రామ స్థాయి లో భూ సమస్యలు పరిష్కరించేందుకు గ్రామ పరిపాలన అధికారి (జి పి ఓ) నియమించబోతున్నారని తెలిపారు. భూ భారతి చట్టం ఏప్రియల్ 14 న ప్రారంభించి నాలుగు మండలాలలో పైలెట్ ప్రాజెక్ట్ కింద అమలు జరుగుతుందని తదుపరి ప్రతి జిల్లాలో ఒక్క మండలంలో అమలు చేస్తారని అక్కడ ఏమైనా సమస్యలు పరిస్కారం కాకపోతే భూ భారతి చట్టంలో మార్పులు తెచ్చి భూ సమస్యలు తీర్చుతారని తదుపరి రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి గ్రామం లో భూ భారతి చట్టం అమలు జరుగుతుందని తెలిపారు. భూమిని తమ కుటుంబ సభ్యులుగా భావిస్తారని చాలా మందికి బ్రతకడానికి భూమినే ఆధారం ఆ భూమి తమదని నిరూపించు కునేందుకు పట్టాదారు పాస్ బుక్ ఉండాలని భూ భారతి చట్టం ద్వారా 13 (బి) లకు పాస్ బుక్ నందు అలాగే 2020 అక్టోబర్ లో 2014 జూన్ 2 కి ముందు సాదా కాగితం, స్టాంప్ పేపర్ పై కొనుగోలు చేసి 12 సం. లు సాగు చేస్తున్నా వారు ధరఖాస్తు చేసుకున్న సాధాబైనామా ధరఖాస్తులు పరిశీలించి వాటిని పట్టాదార్ పాస్ బుక్ నందు అప్డేట్ చేస్తమని ఈ అవకాశం ధరణిలో లేదు అని తెలిపారు. గతంలో కుటుంబంలో కొంతమంది మాత్రమే భూమిని పట్టా మార్పిడి చేసుకునేవారని భూ భారతి చట్టం అమలులో భాగంగా వారసత్వం /పౌతి అమలు చేసేటప్పుడు కుటుంబ సభ్యులందరికి కి,గ్రామ పంచాయతీలో నోటీసులు ఇచ్చి వారం గడువు ఇస్తామని ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలపవచ్చు అని అలాగే పౌతి అమలు అయినా తర్వాత కూడా మార్పులకి అప్పీల్ చేసుకోవచ్చు ఈ అవకాశం ధరణి లో లేదని తెలిపారు. గ్రామ రెవిన్యూ రికార్డులు నిర్వహణలో భాగంగా ప్రతి సంవత్సరం డిసెంబర్ 31 న ప్రతి గ్రామంలో సదస్సులు నిర్వహించి ప్రతి రైతు కి 1 బి అందజేస్తామని ఏమైనా తప్పులు ఉంటే సరి చేస్తామని తెలిపారు. విస్తీర్ణం లో మార్పులు,మిస్సింగ్ సర్వే నెంబర్, సవరణలు లాంటి ప్రతి సమస్యకి మీ సేవ ద్వారా కాకుండా స్వయంగా దరఖాస్తు చేసుకునేలా భూ భారతి పోర్టల్ రూపొదించారని తెలిపారు. ఆధార్ వల్లే ప్రతి ఒక్కరి భూమికి భూధార్ అనే యూనిక్యూ నెంబర్ ఇచ్చి ప్రతి భూమికి సరిహద్దులు నిర్ణయించి సర్వే మ్యాప్ ని భూ భారతి పోర్టల్ లో అప్డేట్ చేస్తామని తదుపరి ప్రజలు పోర్టల్ నుండి డౌన్లోడ్ చేసుకోవచ్చు అని తెలి పారు. రాబోయే రోజులలో భూ సమస్యలు పరిష్కరించేందుకు రెవిన్యూ అధికారులు కృషి చేస్తారని తెలిపారు. ఆర్ డి ఓ సూర్యనారాయణ సెక్షన్ ల వారీగా భూ భారతి చట్టం పై పిపిటి ద్వారా ప్రజలకి వివరించారు. జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు మాట్లాడుతూ రైతు సంకెళ్లు విడిపించేలా భూ భారతి చట్టం ను తెలంగాణ ప్రభుత్వం రూపొందించిందని ఇక నుండి భూ సమస్యలు ఒక్కొక్కటి పరిష్కరించుటం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం లో తహసీల్దార్లు వాజీద్ అలీ,హిమబిందు ఎంపిడిఓ రామచంద్రరావు,అనంతగిరి స్పెషల్ అధికారి శ్రీనివాస్,మున్సిపల్ కమిషనర్ రమాదేవి,రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దివిస్ లెబొరెటరిస్ ఆధ్వర్యంలో ఆర్వో ప్లాంట్ల ఏర్పాటు




**ప్రజాదీవెన నల్గొండ టౌన్ :** దివీస్ లెబొరెటరిస్ లిమిటెడ్ ఆధ్వర్యంలో 20 లక్షల రూపాయలతో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ప్రజల తాగునీటి సౌకర్యార్థం ఆర్వో ప్లాంట్ లను ఏర్పాటు చేశారు. ఆ ప్లాంట్ల ను సోమవారం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ కుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే రోగుల కోసం దివిస్ లెబొరెటరిస్ ఆధ్వర్యంలో ఆర్వో ప్లాంట్ లను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు సూపరింటెండెంట్ డాక్టర్ నగేష్, ఆర్ ఎం ఓ లు డాక్టర్ రత్నా, డాక్టర్ అనిత, ఆసుపత్రి సిబ్బంది, దివిస్ ప్రతినిధులు బి. కిషోర్ కుమార్, సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి కార్యక్రమానికి 93 దరఖాస్తులు...



**ప్రజాదీవెన నల్గొండ :** సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో అన్ని శాఖల జిల్లా అధికారులతో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ గ్రామాల నుండి వచ్చిన ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని దరఖాస్తుల స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారం కొరకు అధికారులు ప్రత్యేక దృష్టి కేటాయించాలని తెలిపారు. వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు .ఈరోజు జరిగిన ప్రజావాణిలో మొత్తం 93 దరఖాస్తులు అందజేశారని వీటిలో ఎక్కువగా భూ సమస్యలపై తాసిల్దారులకు వచ్చిన దరఖాస్తులు 38 ఉన్నాయని తెలిపారు. రాష్ట్రస్థాయిలో జరిగే ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులను వాటి వివరాలను శాఖల వారీగా అదనపు కలెక్టర్ చదివి వినిపించారు, వెంటనే అధికారులు తగు చర్యలు తీసుకొని పరిష్కరించాలని పేర్కొన్నారు. అనంతరం (బ్రౌస్) భారతి రంగా ఆర్గనైజేషన్ ఫర్ వెల్ఫేర్ సొసైటీ వారు జిల్లాలోని 700 మంది టీబి పేషెంట్లకు న్యూట్రిషన్ ఫుడ్ 3000 ప్యాకెట్లు జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు చేతుల మీదుగా టీబి వ్యాధిగ్రస్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీసీఈఓ వివి అప్పారావు బి ఎఫ్ సతీష్ కుమార్ డిఎం అండ్ హెచ్ ఓ కోటాచలం డిడబ్ల్యూ నరసింహారావు సి పి ఓ ఎల్ కిషన్ డి జి డి వో శంకర్ ఎస్సీ అభివృద్ధి అధికారి లత డి సి ఓ పద్మజ వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి మైనార్టీ వెల్ఫేర్ అధికారి జగదీశ్ రెడ్డి డిఎం మార్కెటింగ్ శర్మ కలెక్టరేట్ ఏవో సుదర్శన్ రెడ్డి అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## దాడి చేశారని దంపతులు ఎస్పీకి ఫిర్యాదు



**ప్రజాదీవెన, నల్లగొండ:** తమ భూమిలో కడీలు ఏర్పాటు చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు వచ్చి తమపై దాడి చేశారని నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ కు సోమవారం ఫిర్యాదు చేశారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం నల్లగొండ మండలంలోని అప్పాజిపేట గ్రామానికి చెందిన ఓర్సు నాగభూషణం అతడి భార్య మంగమ్మ తమ గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 35లో 1.25ఎకరాల విస్తీర్ణంలో ఉన్న భూమిలో ఆటోలో కడీలు తెచ్చి ఏర్పాటు చేస్తుండగా, తవిటి కృష్ణ, గండ మళ్ల కమలాకర్ అనే రియల్ ఎస్టేట్ వ్యాపారులు వచ్చి భూతులు తిడుతూ దాడిచేసినట్లు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. తమపై దాడి చేసిన ఇద్దరు వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. దీంతో విచాణ నిర్వహించి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ చెప్పినట్లు బాధితులు పేర్కొన్నారు. కాగా, సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన దాదాపు 30మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి తమ సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి పూర్తి వివరాలు సమర్పించాలని ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశించారు.

# అప్పులపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విపరీత అబద్దాలు

**ఖమ్మం జిల్లా నుంచి ముగ్గురు మంత్రులున్నా నిరుపయోగం**

**కాంగ్రెస్ పార్టీ నుంచి తెలంగాణను కాపాడే బాధ్యత బీఆర్ఎస్ పార్టీదే**

**కేసీఆర్ కి, పార్టీ కార్యకర్తలకు మధ్య వారధిగా ఉంటాను**

**ఏ చిన్న అవసరమున్నా నన్ను కా ర్యకర్తలు సంప్రదించవచ్చు**

**మన కళ్ల ముందే తెలంగాణ ఆగ మవుతుంటే చూస్తూ ఊరుకో%శీ**

**పార్టీ సమావేశంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత**



**ప్రజా దీవెన, భద్రాచలం:** అరవై ల క్షల మంది కార్యకర్తలున్న బీఆర్ఎ స్ పార్టీ అతిపెద్ద కుటుంబమని ఈ కుటుంబాన్ని మరింతగా పెద్దగా రూపుదిద్దుకోవాల్సిన బాధ్యత మ నందరిపై ఉందని ఎమ్మెల్సీ కల్వ కుంట్ల కవిత పేర్కొన్నారు. సోమ వారం భద్రాచలంలో నిర్వహించిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్త లు, తెలంగాణ ఉద్యమకారుల స మావేశంలో ఆమె పాల్గొని కార్యక ర్తలకు భరోసానిచ్చారు. పార్టీ అధి నేత కేసీఆర్కి కార్యకర్తలకు మధ్య వార ధిగా తానుంటానని హామీ ఇ చ్చారు. ఎవరికి ఏ కష్టం వచ్చినా కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారా నికి కృషి చేస్తానన్నారు. ఎవరికి ఏ చిన్న అవసరం వచ్చినా తనను సంప్రదించవచ్చన్నారు.

కార్యకర్తలను కాపాడుకోవడాన్ని బాధ్యతగా స్వీకరిస్తానని తెలిపా రు. సాధించుకున్న తెలంగాణ రా ష్ట్రాన్ని కాపాడుకోవడమే బీఆర్ ఎస్ కార్యకర్తల ప్రథమ కర్తవ్యమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కబంధ హ స్తాల నుంచి తెలంగాణ రాష్ట్రాన్ని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. మనందరి కళ్ల ముం దే తెలంగాణ ఆగమవుతుంటే చూ స్తూ ఊరుకోవద్దన్నారు. మనం కాస్త ఏమరపాటుగా ఉన్న కాంగ్రెస్ పార్టీ తెలంగాణను ఆగం చేస్తుంద ని హెచ్చరించారు. ఈ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలందరినీ సమీక రించాల్సిన అవసరం ఉందన్నారు. మోసపోతే గోస పడుతామన్న విష యాన్ని కేసీఆర్ పదే పదే చెప్పారని గుర్తు చేశారు.

మోసం చేయడమే కాంగ్రెస్ పార్టీ నైజమన్న విషయం రాష్ట్ర ప్రజలకు మరోసారి తెలిసివచ్చిందన్నారు. ఖమ్మం జిల్లా నుంచి రాష్ట్ర కేబినెట్ లో ముగ్గురు మంత్రులున్నా జిల్లా కు మూడు పైసలు కూడా తేలేద న్నారు. నిరుపేదలకు ఆత్మీయ భ రోసా కింద ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని హామీ ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ ఏ ఒక్కరికి సాయం చేయకుండా మోసం చేసిందన్నా రు. రాష్ట్ర అప్పులపై ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క విప రీతమైన అబద్ధాలు చెప్తున్నారని అన్నారు. కాంగ్రెస్ గద్దెనెక్కిన తర్వా త తెచ్చిన రూ.1.60 లక్షల కోట్ల అ ప్పులను ఎందుకు ఖర్చు చేశారంటే సమాధానం చెప్పకుండా ప్రభుత్వం బుకాయిస్తుందన్నారు.

తెచ్చిన అప్పులను ఏయే పనుల కోసం ఖర్చు చేశారో ప్రభుత్వం ప్రజ లకు సమాధానం చెప్పి తీరాలన్నా రు. అప్పటి వరకు ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటామన్నారు. రూ. 40 వేల కోట్ల విలువైన కంచ గచ్చి బౌ లి భూములను రూ.10 వేల కో ట్లకు ప్రభుత్వం తాకట్టు పెట్టిందని.. ఆ డబ్బులు తెచ్చి రైతు భరోసా ఇ చ్చామని, రైతు రుణాలు మాఫీ చే శామని ప్రభుత్వ పెద్దలు చెప్తున్నార ని వివరించారు. అదే నిజమైతే ఇ ప్పటికీ 60 శాతం మంది రైతులకు ఎందుకు రుణమాఫీ కాలేదు, సగం మంది రైతులకు రైతుభరోసా డ బ్బులు ఇవ్వలేదో సమాధానం చె ప్పాలన్నారు. రూ.10 వేల కోట్లు ఎక్కడికిపోయాయి, ఎమయ్యా యో ప్రభుత్వం చెప్పి తీరాలన్నా రు. అప్పులతో పాటు రాష్ట్ర ఖ జానాను ఎందుకు ఖర్చు చేస్తు న్నారని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎక్క డికక్కడ నిలదీయాలని పిలుపు నిచ్చారు.

2004లో చచ్చిన పీనుగలా ఉన్న కాంగ్రెస్ పార్టీ బీఆర్ఎస్తో పొత్తు పెట్టుకొని అధికారంలోకి వచ్చిందని గుర్తు చేశారు. అప్పుడే తెలంగాణ ఇస్తామని మాట ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ కాలయాపన చేయడంతోనే వందలాది మంది బిడ్డలు ఆత్మబలి దానాలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష, యువత బలిదానా లతోనే కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇ చ్చింది తప్ప ఉట్టిగనే ఇవ్వలేదన్నా రు. ఇప్పుడు రాష్ట్రాన్ని పాలిస్తున్న వ్యక్తులు చూడడానికి మాత్రమే తె లంగాణ వాళ్లలాగా కనిపిస్తారని.. కానీ వాళ్లు పని చేసేది తెలంగాణ కు వ్యతిరేకంగానని తేల్చిచెప్పారు. వందలాది హామీలిచ్చి, కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వ చ్చిన కాంగ్రెస్ నిలదీయాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 16 నెలలు గడిచినా ఏ ఒక్క హామీని పూర్తిగా నెరవేర్చలేదన్నారు. తెలం గాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో దే శంలోనే నంబర్ వన్ గా నిలబెట్టిన ఘనత కేసీఆర్ ది అన్నారు. రాష్ట్రా భివృద్ధి కోసం ఒక్క క్షణం కూడా విశ్రాంతి తీసుకోకుండా కష్టపడి ప ని చేశారన్నారు. ఖమ్మం జిల్లాలో 3.50 లక్షల ఎకరాలకు నీళ్లిచ్చేందు కు కేసీఆర్ సీతారామ ఎత్తిపోతల పథకం పనులు చేపట్టి మెజార్టీ ప నులను పూర్తి చేశారని తెలిపారు. తెలంగాణకు ఎప్పటికైనా బీఆర్ఎ స్ పార్టీనే శ్రీరామ రక్ష అన్నారు. 1969లో ఖమ్మం జిల్లాలో పుట్టిన తెలంగాణ ఉద్యమం కొద్ది రోజులకే రాష్ట్రమంతా వ్యాపించిందన్నారు. బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్ లో చేరిన భద్రాచలం ఎమ్మెల్యే తె ల్లం వెంకట్రావు ఉద్యమ ద్రోహి అ న్నారు. తెలంగాణ ఉద్యమ సమ యం నుంచి ఎందరో అలాంటి ద్రో హుల కుట్రలను చూశామన్నారు. త్వరలోనే భద్రాచలం నియోజకవ ర్గానికి ఉప ఎన్నిక వస్తుందని, ఆ ఎ న్నికల్లో గెలుపు బీఆర్ఎస్ దేనని స్పష్టం చేశారు. భద్రాచలం సీతారాములకు ప్రత్యేక పూజలు ఎమ్మెల్సీ కల్వ కుంట్ల కవిత సోమవారం ఉదయం భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వా మి వారి ఆలయంలో ప్రత్యేక పూజ లు చేశారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్సీ కవితకు వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికా రు. ఆమెతో సంప్రదాయ బద్ధంగా పూజలు చేయించారు. అనంతరం వేద ఆశీర్వచనం చేసి తీర్థప్రసా దాలు అందజేశారు.

## సామాజిక మాధ్యమాల పట్ల అప్రమత్తత అవసరం

**త్వరలో హైదరాబాదులో జాతీ య సదస్సు**

**అర్హులైన జర్నలిస్టులు అందరికీ అక్రిడేషన్ కార్డులు జారీ**

**తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే శ్రీనివాస్ రెడ్డి**




**ప్రజా దీవెన, నాగర్ కర్నూల్:** సమా జంలో మీడియా భవిష్యత్ కు ప్ర శ్నార్థకంగా మారిన సామాజిక మాధ్యమాలు, ఆర్టి ఫిషియల్ ఇం టిలిజెన్సీ పట్ల అప్రమత్తంగా ఉండా లని, దీనిపై త్వరలో హైదరాబాదు లో జాతీయస్థాయి వర్క్ షాప్ ను నిర్వహిస్తామని తెలంగాణ మీడి యా అకాడమీ చైర్మన్ కే శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం నాగర్ కర్నూలు జిల్లా సోమశిలలో రాష్ట్ర అధ్యక్షులు విరహత్ అలీ అధ్యక్షత న జరిగిన టీయూడబ్ల్యూజే (ఐజే యూ) రాష్ట్ర కార్యవర్గ సమావేశాని కి ముఖ్య అతిథిగా హాజరైన ఆయ న మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇం టిలిజెన్సీ మూలంగా భవిష్యత్తులో మీడియా రంగంలో మ్యాన్ పవర్ లేకుండా చేసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

అంతేకాకుండా కల్పితాలతో ఏఐ సమాజాన్ని తప్పుదోవ పట్టించే ప్ర మాదం పొంచి ఉందని, దీనిపై జర్న లిస్టులు, ప్రజలు అప్రమత్తంగా ఉం డాలని అన్నారు. సోషల్ మీడియా విప్లవం భావ ప్రకటన స్వేచ్ఛకు మంచి వేదిక అయినప్పటికీ దానిని అడ్డుపెట్టుకొని కొన్ని శక్తులు అలజ డి సృష్టించడం సహించరానిది అ న్నారు. రాజ్యాంగం భావ ప్రకటన స్వేచ్ఛ కల్పించిందే కానీ ఇతరుల స్వేచ్ఛను హరించే హక్కు ఇవ్వలే దన్నారు. గత ప్రభుత్వం రూపొం దించిన అక్రిడిటేషన్ జీవో అప్రజా స్వామికంగా ఉందని కొందరు న్యా యస్థానాన్ని ఆశ్రయించడంతో ఆ జీవను రద్దు చేస్తూ గదా అక్టోబర్ మాసంలో హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. దీంతో కొత్త మార్గదర్శకాలు రూపొందించేందు కు కమిటీ వేశామని , అంతేకాకుం డా ఆ కమిటీ నివేదికను ప్రభుత్వా నికి సమర్పించిందన్నారు. త్వరలో దీనికి సంబంధించిన జీవో విడుదల కాను ఉందని ఆయన స్ప ష్టం చేశారు. అక్రిడిటేషన్ కార్డుల విషయంలో జరుగుతున్న తప్పు డు ప్రచారాన్ని ఎవరు నమ్మవద్దని, ఈ విషయమై ఎవరు ఆందోళన చెందవద్దని, అర్హులైన ప్రతి జర్నలి స్టుకు అక్రిడిటేషన్ కార్డులు మంజూ రు అవుతాయని ఆయన తెలిపా రు. అక్రిడిటేషన్ కమిటీలను కూడా త్వరలోనే ఏర్పాటు చేస్తామని చె ప్పారు. ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారం... ఉద్యమాలతోనే జ ర్నలిస్టుల సమస్యలు పరిష్కారం అవుతాయని ఐజేయు స్టీరింగ్ కమి టీ మెంబర్ దేవులపల్లి అమర్ అ న్నారు. ప్రభుత్వాలు ఏవైనా జర్న లిస్టుల పక్షపాతిగా, జర్నలిస్టుల సం క్షేమం కోసం గత 65 ఏళ్లుగా పోరాడుతున్న చరిత్ర తమ సంఘా నికే ఉందని అన్నారు. సంఘ నా యకులకు ప్రభుత్వ పదవులు వ చ్చినంత మాత్రాన, సంఘ ప్రయో జనాల కోసం కాదని ఆ పదవుల బాధ్యతలు వేరుగా ఉంటాయని ఆయన స్పష్టం చేశారు.

టీయూడబ్ల్యూజే ఐజేయు ఎవ రికీ అనుకూలం కాదు.. టీయూ డబ్ల్యూజే (ఐజేయూ) ఏ ప్రభుత్వా నికి, ఏ పార్టీకి అనుకూలం కాదని, జర్నలిస్టుల సంక్షేమమే ఏకైక లక్ష్య మని రాష్ట్ర అధ్యక్షులు విరహత్ అ లీ స్పష్టం చేశారు. జర్నలిస్టుల ప్ర ధాన సమస్యలైన ఇండ్లు ఇళ్ల స్థలా లు, హెల్త్ కార్డులు, అక్రిడిటేషన్ కా ర్డులు, ఉచిత విద్య తదితర సమ స్యలపై ఉద్యమ కార్యాచరణ రూ పొందిస్తున్నట్లు తెలిపారు. తమ సంఘం వినతి మేరకు రాష్ట్ర వ్యా ప్తంగా మెడికవర్ ఆసుపత్రుల్లో ఉం డే ఆర్థోపెడిక్, గుండె, కిడ్నీ సంబం ధిత వ్యాధులకు హెల్త్ కార్డులపై చి కిత్స చేసేందుకు ఆసుపత్రి యాజ మాన్యం నిర్ణయించడం అభినంద నీయమని అన్నారు. గత కార్యవర్గ సమావేశం అనంతరం చేపట్టిన కా ర్యకలాపాలపై రాష్ట్ర ప్రధాన కార్య దర్శి కే రామనారాయణ నివేదిక స మర్పించారు.

ఈ సమావేశంలో ఐజేయూ కార్య దర్శి వై నరేందర్ రెడ్డి, జాతీయ కా ర్యవర్గ సభ్యులు నగునూరి శేఖర్, టీయూడబ్ల్యూజే ఉప ప్రధాన కా ర్యదర్శి కే రాములు, ఉపాధ్యక్షులు బుర్ర సంపత్ కుమార్ గౌడ్, గాడి పల్లి మధు గౌడ్, పైసల్ అహ్మద్, రాష్ట్ర కార్యదర్శులు గుండ్రాతి మ ధుగౌడ్, వరకాల యాదగిరి, కే శ్రీ కాంత్ రెడ్డి, కోశాధికారి మోతే వెం కటరెడ్డి తో పాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు హాజరయ్యారు. రాష్ట్ర కార్యవర్గ స మావేశాన్ని విజయవంతంగా నిర్వ హించిన నాగర్ కర్నూల్ జిల్లా శాఖ ను రాష్ట్ర కార్యవర్గం అభినందిం చింది.

**తీర్మానాలు**

జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర మంత్రులందరికీ యు ద్ధ ప్రాతిపదికన వినతి పత్రాలు అం దించాలని సమావేశం తీర్మానించిం ది.

సంఘ సంస్థాగత కార్యకలాపాల ను మరింత పటిష్టం చేయడానికి రాష్ట్ర బాధ్యులను జిల్లా ఇన్చార్జి లుగా నియమించాలని కార్యవర్గం నిర్ణయించింది.

టీయూడబ్ల్యూజే (ఐజేయు)కు అనుబంధంగా ఉన్న ప్రెస్ క్లబ్ ల కార్యకలాపాలను పరిశీలించేం దు కుగాను ఆరుగురు సీనియర్లతో క మిటీ ఏర్పాటు చేయాలని కార్య వర్గం నిర్ణయించింది.

ఆర్టీసీ బస్సుల్లో జర్నలిస్టులకు రాష్ట్రవ్యాప్తంగా ఉచిత బస్సు సౌక ర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కో రుతూ తీర్మానం చేసింది.

## ప్రభుత్వ పాఠశాల లోనే నాణ్యమైన విద్య



**శాలిగౌరారం ఏప్రిల్ 21.( ప్రజాదీవెన ) :** బడికి వెళ్లకుండా ఇంటి వద్ద ఉండే పిల్లలంతా బడిలో చేరాలని ఉపాధ్యాయులు కోరారు. శాలిగౌరారం మండలం మనిమద్దె గ్రామంలో ముందస్తు బడిబాట కార్యక్రమం లో భాగంగా ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు అంగన్వాడి టీచర్లు ఏఎన్ఎం విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామ యువకులు పాల్గొన్నారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య,ఉచిత పుస్తకాలు, మధ్యాహ్నం భోజనము, రెండు జతల ఏకరూప దుస్తులు, వారానికి మూడు రోజులు రాగి జావా, మూడు రోజులు కోడిగుడ్డు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, మల్లేష్, మారోజు వెంకటాచారి అంగన్వాడీ టీచర్ శంకరమ్మ, ఏ ఎన్ ఎం సువర్ణ, గ్రామస్థులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



**శాలిగౌరారం ఏప్రిల్ 21.(ప్రజా దీవెన ) :** కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం కోసం ప్రవేశ పెడుతున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కాంగ్రెస్ నాయకులు షేక్ ఇంతియాజ్ అహ్మద్ అన్నారు. శాలిగౌరారం మండలం వల్లాల గ్రామంలో పలువురికి సీఎం ఆర్ చెక్కులను పంపిణీ చేశారు. కట్టగురి పార్వతమ్మ కు 35 వేలు,భూపతి సత్యనారాయణ కు 45 వేలు,బెల్లి సరస్వతి భర్త సైదులు కు 60 రూపాయల చెక్ లను ఇంతియాజ్ అహ్మద్ పంపిణి చేశారు. ఈ కార్యక్రమం లో మాజీ ఎంపీటీసీ మాదగోని కవిత రాంలింగయ్య, మాజీ ఉపసర్పంచ్ సైదులు,మాజీ వార్డ్ సభ్యులు పద్మ రమేష్ పాల్గొన్నారు.

## కేపీఎం ప్రభుత్వ ఒకేషనల్ కళాశాల ప్రిన్సిపల్ గా మేదరి షీబా



**ప్రజాదీవెన నల్గొండ టౌన్ :** నల్గొండలోని కేపీఎం ప్రభుత్వ ఒకేషనల్ కళాశాల ఇంచార్జి ప్రిన్సిపల్ గా డా. మేదరి షీబా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమెను జిల్లా ఇంటర్మీడియట్ విద్యా అధికారి దస్రునాయక్, ప్రభుత్వ బాలుర, బాలికల కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు షీబాను సన్మానించారు. ఈ కార్యక్రమంలో

ఫౌండేషన్ సీఈవో మారం గోనారెడ్డి, ప్రిన్సిపాళ్లు రాకెండ్ కుమార్, సుధారాణి, నరసింహ, ధనమ్మ, వెంకన్న, శిల్ప, మేరీ, లక్ష్మి, సునిల్ రెడ్డి , విజయ్, రామస్వామి, యాదగిరి పాల్గొన్నారు.

## దీర్ఘకాలిక రోగాలకు ఆయుర్వేదంతో పరిష్కారం

**బిఆర్ఎస్ నాయకులు జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షులు గండూరి కృపాకర్**



**సూర్యాపేట:** దీర్ఘకాలిక రోగాలకు ఆయుర్వేదంతో శాశ్వత పరిష్కార మార్గం ఉంటుందని గండూరి ట్రస్టు నిర్వాహకులు, బిఆర్ఎస్ నాయకులు, జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షులు గండూరి కృపాకర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రం 45 వార్డు లోని గండూరి జానకమ్మ రామస్వామి వాటర్ ప్లాంట్ నందు గండూరి ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో శ్రీ దరీయం ఆయుర్వేద నేత్ర క్లినిక్ సహకారంతో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఆయుర్వేదం అనేది అతి పురాతన కాలం నుండి ఉ ంది అని ఇంగ్లీష్ మందులు, అలోపతి మందులు వాడితే అప్పటి వరకె ఉపశమనం ఉంటుందని ఆయుర్వేద మందులు వాడితే శాశ్వత నివారణ ఉంటుందని తెలిపారు. ఇప్పుడు డయాబెటిస్ అనేది పదిమందిలో ఆరుగురికి వస్తుందని మనం తినే ఆహారం లోపం వలన డయాబెటిస్ వస్తుందని దానికి కూడా ఆయుర్వేద మందులు వాడితే శాశ్వత నివారణ ఉంటుందని తెలిపారు. ఈ క్యాంపులో కంటి మచ్చల క్షీణత, ఆప్టిక్ న్యూరోపతి, కంటి నీటి కాసులు, దూరదృష్టి లోపం, సమీప దృష్టిలోపం, నిరంతర పోడి కన్నులు కండ్ల కలకలు, కీళ్లవాతం కీళ్లలో క్షిణించడం, వెన్నెముక సంబంధిత సమస్యలు, జ్ఞాపకశక్తి సమస్యలు వెన్ను నరాల నొప్పి, ఉబ్బిన నరాలు తదితర వ్యాధులకు చూస్తున్నారని అవకాశాన్ని వార్డు, సూర్యాపేట పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం వార్డు ప్రజలు టిఆర్ఎస్ నాయకులు గండూరి కృపాకర్ గురించి మాట్లాడుతూ 60 70 సంవత్సరాల చరిత్ర ఉన్న ఈ వార్డులో ప్రతి ఒక్క ఇంట్లో ఎవరికీ ఏ సమస్య ఉ ంది అని తెలుసుకొని వారికి ఆర్థికంగా సహాయం చేసే గొప్ప మనసున్న వ్యక్తి అని అన్నారు. వారు పెట్టే ప్రతి క్యాంపు వార్డు ప్రజలకే కాకుండా సూర్యాపేట పట్టణ ప్రజల కూడా ఉపయోగపడే విధంగా ఉంటుందని అన్నారు. గండూరి కృపాకర్ లాంటి నాయకులు మా వార్డులో ఉండడం మా వార్డు అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కృష్ణ దాస్, శ్రీ ధరీయం బ్రాంచ్ మేనేజర్ పవన్, బెలిదే శ్రీనివాస్, దేవిరెడ్డి రవీందర్ రెడ్డి, గుండా లక్ష్మయ్య, నూకల వెంకటరెడ్డి, ఉప్పల రాజేంద్రప్రసాద్, కుక్కడప్పు బిక్షం, రాచకొండ శ్రీనివాస్, సవరాల సత్యనారాయణ, బోనగిరి భాస్కర్, కక్కిరేణి చంద్రశేఖర్, సందీప్, కళ్యాణ్, ఇస్మాయిల్, ఎండి లతీఫ్, మురారిశెట్టి జోగయ్య, మిర్యాల శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

## భూ సమస్యలు తీర్చేందుకే భూభారతి చట్టం



**జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి**

**ప్రజాదీవెన నల్గొండ :** రైతుల భూ సమస్యలు తీర్చేందు కే రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టం 2025 తీసుకువచ్చిందని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. భూ భారతిపై నిర్వహిస్తున్న అవగాహన సదస్సులలో భాగంగా సోమవారం ఆమె నల్గొండ జిల్లా, గుండ్లపల్లి తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన భూ భారతి అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై రైతులకు తెలంగాణ భూ భారతి (భూమి హక్కుల చట్టం -2025) పై అవగాహన కల్పించారు. ధరణిలో భూములకు సంబంధించి సవరణలు చేసేందుకు అవకాశం లేదని, భూ భారతి లో రికార్డులను అప్ డేట్ చేసే అవకాశం ఉందన్నారు. సక్సేషన్ ,మ్యుటేషన్ కు దరఖాస్తు చేసుకున్న 30 రోజులలో అవుతుందని,30 రోజులలో కాకుంటే 31 వ రోజు ఆటోమేటిక్ గా అవుతుందన్నారు. భూ భారతి లో క్షేత్రస్థాయిలో పరిశీలించిన మీదటే భూములు రిజిస్ట్రేషన్ చేసే అవకాశం ఉందని తెలిపారు. ధరణిలో అనుభవదారులకు ప్రాధాన్యత లేదని,భూ భారతిలో అనుభవదారుకు ప్రాధాన్యత ఉంటుందని అన్నారు. భూ భారతిలో భూములకు సంబంధించిన వివరాలన్నీ ఆన్లైన్లో నమోదు చేయబడతాయని, ఈ వివరాలన్నీ అన్ని శాఖలకు పంపించడం జరుగుతుందని, ఎవరైనా ఈ వివరాలను చూసుకోవచ్చని అన్నారు. ఆధార్ కార్డ్ లాగే భూములకు భూదార్ కార్డు ఇవ్వడం జరుగుతుందని, రుణాలు కావాలంటే రైతు ఎలాంటి కాగితాలు సమర్పించాల్సిన అవసరం లేదని, ఆన్లైన్లో ఉన్న భూముల వివరాల ఆధారంగా రైతుకు రుణం ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ధరణిలో లేని అప్పీల్ అవకాశం భూ భారతి లో ఉందని ఆమె వెల్లడించారు. అప్పీల్స్ అవకాశం భూ భారతి లో ఉందని, ధరణి ఉన్న సమయంలో రిజిస్ట్రేషన్లు సవరణలు చేసే అధికారం లేదని, ఇప్పుడు జిల్లా స్థాయిలోనే సవరణలు చేసే అధికారం ఉ ందని ఆమె తెలిపారు. ఒక వేళ రైతు న్యాయ సహాయం అవసరమైతే ఉచితంగా ప్రభుత్వమే ఏర్పాటు చేస్తుందన్నారు. సాదా బైనామీల వివాదాల పరిష్కారం భూ భారతి లో ఉందని అన్నారు. దేవరకొండ ఆర్డిఓ రమణారెడ్డి, తహసిల్దార్ భూ భారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## నేడు మంత్రి ఉత్తమ్ చేతుల మీదుగా మహాత్మ జ్యోతిబాపూలే విగ్రహావిష్కరణ

**పూలే విగ్రహావిష్కరణకు అన్ని వర్గాలప్రజలుతరలిరావాలి:సీతయ్య**



**ప్రజా దీవేన, కోదాడ:** సమాజంలో అంటరానితనం కుల వివక్షకు వ్యతిరేకంగా మహిళా విద్య కై పోరాడిన మహాత్మ జ్యోతిబాపూలే విగ్రహావిష్కరణకు అన్ని వర్గాల ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని డిసిసి ఉపాధ్యక్షులు కోదాడ మాజీ సర్పంచ్ పార సీతయ్య పిలుపునిచ్చారు సోమవారం పట్టణంలోని రంగా థియేటర్ చౌరస్తాలో విగ్రహావిష్కరణ ఏర్పాట్లను విగ్రహ నిర్వహణ కమిటీ సభ్యులు, పట్టణ ప్రముఖులతో కలిసి పరిశీలించి అనంతరం మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల, సివిల్ సప్లై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, స్థానిక శాసన సభ్యురాలు పద్మావతి రెడ్డి ఇంకా అనేక మంది ముఖ్య అతిథుల చేతుల మీదుగా విగ్రహావిష్కరణ జరుగుతుందని అన్ని వర్గాల ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాలూరి సత్యనారాయణ, బాల్ రెడ్డి, సైదా నాయక్, గార్లపాటి వీరారెడ్డి, పంది తిరపయ్య, దండా వీరభద్రం, చలిగంటి లక్ష్మణ్, గంధం యాదగిరి, యాకూబ్, మురళి, వెంకటేష్ శేఖర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మంత్రి ఉత్తమ్ పర్యటన

**ప్రజాదీవెన నల్గొండ :** సూర్యాపేట, నల్గొండ జిల్లాలో నేడు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పర్యటించనున్నారు. చిలుకూరు మండలం నారాయణపురం నుండి బాలాజీ నగర్ వరకు 20 కోట్లతో నిర్మించ తలపెట్టిన డబుల్ రోడ్ పనులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం కోదాడ నియోజకవర్గ పరిధిలోని తొగర్రాయి నుండి సీత్ల తండా వరకు 8 కోట్లతో నిర్మించ తలపెట్టిన రహదారి నిర్మాణం పనులకు, అదే నియోజకవర్గ పరిధిలోని కూచిపూడి నుండి తొగర్రాయి వరకు 12 కోట్లతో నిర్మించ తలపెట్టిన డబుల్ రోడ్ నిర్మాణపు పనులకు శంకుస్థాపన, కోదాడ పట్టణంలో నిర్మిస్తున్న 100 పడకల ఆసుపత్రిలో నిర్మాణపు పనుల పరిశీలన, అనంతరం మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహావిష్కరణ చేస్తారు. ఆ తరువాత నల్గొండ జిల్లా మిర్యాలగూడ, నకిరేకల్, దేవరకొండ, నాగార్జున సాగర్, నియోజకవర్గలకు సంబంధించిన పౌర సరఫరాల శాఖా అధికారులతో సమీక్ష చేస్తారు.

## జనగామ జిల్లాలో.... ఒకరి హత్య
# మరో మహిళ ఆత్మహత్య
### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి
### లంచం తీసుకుంటూ ఏ. సీ. బి. కి చిక్కిన ఆర్. ఐ.

**ప్రజాదీవెన, జనగామ :** జనగామ జిల్లాలో జరిగిన వేరు వేరు సంఘటనలలో ఒక వ్యక్తి హత్యకు గురికాగా మరో మహిళ సోమవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఇది ఇలా ఉండగా మరో వ్యక్తి రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడు. మరోవైపు ఎమ్మార్వో కార్యాలయంలో పనిచేసే రెవిన్యూ ఇన్స్పెక్టర్ లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. జనగామ జిల్లాలో జరిగిన ఆయా సంఘటనల వివరాలు ఇలా ఉన్నాయి.జనగామ జిల్లా కొడకండ్ల మండలం రేగుల తండా లో ఇరువురు వ్యక్తుల మధ్య నెలకొన్న భూతగాధ విషయంలో వివాదాలు ముదరడంతో గూగులోత్ శ్రీను ( 47) అనే వ్యక్తి దారుణ హత్యకు గురి అయ్యాడు. మద్యం మత్తులో ఆయనను ప్రత్యర్థులు శనివారం రాత్రి హత్య చేసినట్టు ప్రత్యక్ష సాక్షులు పోలీసులకు తెలిపారు. ఇదిలా ఉండగా మరోవైపు పాలకుర్తి మండలంలో వావిలాల గ్రామానికి చెందిన వనపర్తి లచ్చుమ్మ అనే 50 సంవత్సరాల మహిళమానసికంగా ఆందోళన కారణంగా సోమవారం తన వ్యవసాయ భూమి వద్ద చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న పోలీసులు తెలిపారు.ఈ సంఘటనలు ఇలా ఉండగా మరోవైపు లింగాల గణపురం మండలంలో పటేల్ గూడెం గ్రామం సమీపంలో జరిగిన ఘోరమైన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయాల పాలు అయ్యారు. వేగంగా వస్తున్న కారు ద్విచక్ర వాహనం ఢీకొనడంతో సోమవారం జరిగిన ఈ ఘోర ప్రమాదంలో మరణించిన వ్యక్తిని నవాబుపేట గ్రామానికి చెందిన కళ్యాణ్ గా గుర్తించారు. వీరిని జనగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ప్రమాదాలు ఇలా ఉండగా మరోవైపు జనగామ జిల్లా చిల్పూర్ మండలంలో ఎమ్మార్వో కార్యాలయంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ గా పని చేస్తున్న వినీత్ ఒక భూమి కి సంబంధించిన విషయం లో ఒక వ్యక్తి నుండి 26 వేల రూపాయలు లంచం డిమాండ్ చేసి తీసుకుంటుండగా సోమవారం ఎసిబి అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# శ్రీవారి కానుకుల వేలం
### ప్రకటన విడుదల చేసిన టిటిడి



**ప్రజాదీవెన, తిరుమల :** శ్రీవారి ఆలయం భక్తులకు గుడ్ న్యూస్ చెప్పింది. స్వామివారి కానుకలను భక్తులు దక్కించుకునే అవకాశాన్ని కల్పించింది. హుండీ ద్వారా భక్తులు సమర్పించిన కానుకలను ఈ-వేలం వేయనున్నట్లు- ప్రకటించింది. స్వామివారి కానుకలు కావాలనుకునేవారు వేలంలో పాల్గొనాల్సి ఉంటుంది.తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు ఇతర అనుబంధ ఆలయాలలో హుండీ ద్వారా భక్తులు కానుకగా సమర్పించిన వాచీలను వేలం వేయనున్నట్లు- సోమవారం ప్రకటన విడుదల చేశారు టీటీడీ అధికారులు. మే 1, 2వ తేదీలలో రాష్ట్ర ప్రభుత్వ కొనుగోలు పోర్టల్ ద్వారా ఇ-వేలం వేయనున్నారు. ఇందులో -టైటాన్, సిటిజన్, సొనాట, రాగా, -టైమ్స్, -టైమెక్స్ తో పాటు- ఇతర కంపెనీల స్మార్ట్ వాచీలున్నాయి.ఈ-వేలంలో భాగంగా కొత్త వాచ్ లు, ఉపయోగించినవి, పాక్షికంగా దెబ్బతిన్న వాచీలు మొత్తం 62 లాట్లు- ఉంచారు అధికారులు. ?ఇతర వివరాలకు తిరుపతిలోని టీటీడీ మార్కెటింగ్ కార్యాలయం (వేలములు) నంబరుకు కార్యాలయ వేళల్లో ఫోన్ చేసి సంప్రదించగలరు. అదేవిధంగా టీటీడీ లేదా ప్రభుత్వ వెబ్‌సైట్‌ల ద్వారా వేలంలో పాల్గొనవచ్చు.

## దాస్యభక్తికి నిలువెత్తు నిదర్శనం!

**ప్రజాదీవెన, తిరుమల :** భక్తితత్పరులు అయినవారు నవవిధ భక్తిమార్గాల ద్వారా దైవాన్ని చేరుకునే ప్రయత్నం చేస్తుంటారు. ఈ భక్తి విధానాల్లో దాస్యభక్తికి నిలువెత్తు నిదర్శనం హనుమంతుడు. అనంత శక్తులు తనలో దాగి ఉన్నా.. రామబంటుగా ఒదిగి ఉండటమే దాసాంజనేయుడికి ఇష్టం. ఆ పరమభక్తుడు పిల్లల దేవుడు, పెద్దల దేవుడు, అందరి దేవుడు. నమ్మిన దైవంపై పరిపూర్ణమైన అంకితభావం కలిగి ఉండాలి. నిరంతరం స్వామి సేవలో తరిస్తూ ఇది తప్ప మరేదీ తనకు అవసరం లేదని ఆంజనేయుడు ప్రార్థించేవాడు. భవబంధచ్ఛిదే తస్యై స్పృహయామి న ముక్తయే భవాన్ ప్రభురహం దాస ఇతి యత విలుప్యతే'ఓ ప్రభూ! ఈ భవబంధాల నుంచి నన్ను విముక్తుడిని చేయదలిచితే చేయి. మోక్షాన్ని ప్రసాదించాలనుకుంటే, ప్రసాదించు. కానీ, నేను మాత్రం ఇవేవీ కోరుకోను. మీపై నా దాస్య భావనను మరిపించేదేదీ నాకు అవసరం లేదు' అని వినయంగా వేడుకుంటాడు హనుమ.పురాణాలను అనుసరించి హనుమ చిరంజీవి. నిరంతరం రామనామాన్ని జపిస్తుంటాడు. అంతేకాదు, ఎక్కడైనా రామనామం వినిపిస్తే చాలు.. అక్కడికి వెళ్లిపోతాడు. ఆనందబాష్పాలు నిండిన కండ్లతో, చేతులు జోడించి అక్కడే ఉంటాడు. రామకథా గానం చేస్తున్న భక్తుల సేవా సంకల్పాన్ని పవనసుతుడు మరింత బలపరుస్తాడని శాస్త్రాలు చెబుతున్నాయి.సురోవసురో వాప్యథ వానరో నరఃసర్వాత్మనా యః సుకృతజ్ఞముత్తమమ్‌భజేత రామం మనుజాకృతిం హరిం య ఉత్తరాన నయత్కోసలాన్దివమితి (భాగవతం)'సురులు గానీ, అసురులు గానీ, నరులు గానీ, వానరులు గానీ, మానవమాత్రునిగా ఈ లోకంలో అవతరించిన దేవాదిదేవుడైన ఆ శ్రీరామచంద్ర ప్రభువును ఆరాధించాలి. భక్తుడు ఆచరించే తృణమాత్రపు సేవనైనా ప్రేమతో స్వీకరించే ఆ స్వామిని సేవించడానికి కఠోర తపస్సులు ఆచరించ అవసరం లేదు. భగవంతుడు ప్రీతి చెందితే, తన భక్తుడికి సార్థకత చేకూరినట్టే. రామచంద్రుడు అయోధ్య వాసులందరికీ తన స్వధామాన్ని (వైకుంఠాన్ని) అనుగ్రహించాడు' అని పలికిన హనుమంతుడి మాటలు రామభక్తులకు కొండంత బలాన్నిస్తాయి.

## దరఖాస్తులకు నేడే ఆఖరు

**ప్రజాదీవెన నల్గొండ :** ప్రధాన మంత్రి ఇంటర్న్ షిప్ పథకం రెండో దశ దరఖాస్తులకు మంగళ వారం ఒక్క రోజే గడువు ఉందని జిల్లా పరిశ్రమల శాఖ జేడీ వి.కోటేశ్వర్ రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 21 నుంచి 24 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండి కుటుంబంలో ఎవరూ ప్రభుత్వ ఉద్యోగి ఉండొద్దని.. పదవ తరగతి, ఇంటర్, పాలిటెక్నిక్ డిప్లొమా, డిగ్రీ పూర్తి చేసి వార్షిక ఆదాయం రూ.8 లక్షలలోపు ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి అర్హత గల వారు pminternship.mca.gov.in పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

# కొలిక్కివచ్చిన హ్యామ్ రోడ్లు
### మొదటగా 5,189 కి.మీల గుర్తిం పు .. రోడ్లు భవనాలు శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



**ప్రజా దీవెన,హైదరాబాద్:** రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ పరిధిలో హైబ్రి డ్ యాన్యునిటీ మోడ్ (హ్యామ్) వి ధానంలో అభివృద్ధి చేయదల్చిన రోడ్ల గుర్తింపు ఒక కొలిక్కి వచ్చింది. తొలిదశలో 5,189 కిలోమీటర్ల ప రిధిలో రహదారులను అభివృద్ధి చేయాలని శాఖ అధికారులు గుర్తించారు. ఇదే విషయాన్ని ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి వివరించారు. సోమవారం సచివాలయం లోని తన చాంబర్‌లో మంత్రి కోమ టి రెడ్డి హ్యామ్ రోడ్లు, రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తరభాగం, జాతీయ ప్రాజెక్టులపై శాఖ ముఖ్య అధికారులు వికాస్‌రాజ్, హరిచం దనలతో కలిసి సమీక్ష నిర్వహిం చారు. హ్యామ్ రోడ్ల గుర్తింపు, ఎం పికపై చర్చించారు. తొలిదశలో ఎంపికైన హ్యామ్ రోడ్ల పూర్తి స్థాయి ని ర్మాణ అంచనాలను సిద్ధం చేసి ఇ వ్వాలని మంత్రి కన్సల్టెంట్లను ఆదే శించారు. విదేశీ పర్యటన నుంచి సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రానికి వచ్చి న అనంతరం హ్యామ్ రోడ్లపై సమీక్ష నిర్వహించి, రోడ్ల అభివృద్ధికి క్యాబి నెట్ ఆమోదం తీసుకున్న తర్వాత పనులను ప్రారంభిస్తామ న్నారు. ఆర్ఆర్ఆర్ ఉత్తరభాగం రహదారి కోసం భూములిచ్చిన రైతులకు నష్టపరిహారం చెల్లించే ప్రక్రియను త్వరితగతిన చేపట్టాలని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) అధికారులకు సూచించారు. జాతీయ రహదారి ప్రణా ళిక %-2025-%26కు ప్రతిపాదనలను త్వరగా సిద్ధం చేయాలన్నారు. గుంతలు లేని, సురక్షిత రహదారు లను నిర్మించడమే ప్రభుత్వ లక్ష్య మని మంత్రి చెప్పారు.

# తెలంగాణ గొంతుకకాదు
### గొంతు కోసిన పార్టీ బిఆర్ఎస్..
### 25 ఏల్లుకాని పార్టీ రజతోత్సవం ఎలా చేస్తుంది
### బిఆర్ఎస్ తీరుపై మండిపడ్డ ఎంపి చామల



**ప్రజా దీవెన,రంగారెడ్డి :** తెలంగాణ గొంతుక కాదు.. గొంతు కోసిన పార్టీ బీఆర్ఎస్ అని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి విమర్శించారు. కేసీఆర్ అర్జెరట్‌గా సీఎం ఎందుకు అవ్వాలో కేటీఆర్ చెప్పాలన్నారు. బీఆర్ఎస్ వద్దనే కదా ప్రజలు ఇంటికి పంపిందని, ప్రభుత్వం మీద విష ప్రచారం ఎందుకు? అని ప్రశ్నించారు. ఇబ్రహీంపట్నంలో జరిగిన రైతు సభలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. తుపాకీ రాముడు, అగ్గిపెట్టె- హరీష్, లిక్కర్ కవిత తప్పితే.. పార్టీ పెట్టినప్పుడు ఉన్నోళ్లు ఇప్పుడు ఎవరు ఉన్నారని ఎద్దేవా చేశారు. ప్రతిపక్ష నాయకుడిగా అసెంబ్లీకే రాని కేసీఆర్‌ను మరలా సీఎం చేయాలా?, పదేళ్లు అధికారంలో ఉండి సన్నబియ్యం ఎందుకు ఇవ్వలేదు అని ఎంపీ చామల ప్రశ్నించారు. రజతోత్సవం ఏ పార్టీదో కేటీఆర్ చెప్పాలి. టీఆర్ఎస్ పార్టీనే లేదు, బీఆర్ఎస్ ఏర్పడి 25 ఏళ్లు కాలేదు. కేసీఆర్ అర్జెరట్‌గా సీఎం ఎందుకు అవ్వాలో కేటీఆర్ చెప్పాలి. అర్జెరట్‌గా వచ్చి ఏం చేస్తాడు.. పదేళ్లు 7 వేల కోట్లు- అప్పులు చేశారు. మీరు వద్దనే కదా ప్రజలు ఇంటికి పంపింది, ప్రభుత్వం మీద విష ప్రచారం ఎందుకని మండిపడ్డారు. తెలంగాణ గొంతుక కాదు.. గొంతు కోసిన పార్టీ బీఆర్ఎస్. తుపాకీ రాముడు, అగ్గిపెట్టె- హరీష్, లిక్కర్ కవిత తప్పితే.. పార్టీ పెట్టినప్పుడు ఉన్నోళ్లు ఇప్పుడు ఎవరు ఉన్నారు. తెలంగాణ ప్రజలకు విజ్ఞప్తి.. కోట్లు- ఖర్చు చేస్తున్నారు బీఆర్ఎస్ వాళు,, బీఆర్ఎస్ వాళ్ల డబ్బులు ఇంటింటికి రావాలి, ప్రజలు వసూలు చేయండి' అని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. దళితున్ని సీఎం చేస్తా అని మోసం చేసినందుకు కేసీఆర్ సీఎం అవ్వాలా?, మూడు ఎకరాలు ఇస్తా అని మోసం చేసినందుకు సీఎంను చేయాలా?, కాళేశ్వరం పేరుతో దోచుకున్నదుకా?, ప్రతిపక్ష నాయకుడిగా అసెంబ్లీకే రాని కేసీఆర్‌ను మరలా సీఎం చేయాలా?. కేసీఆర్ మంచి అడ్మినిస్ట్రేటర్ అయితే తెలంగాణ అప్పుల పాలు ఎట్లా అయ్యేది. రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని బదనం చేయడం తప్పితే ఏముంది? మీరు చేసేది. కాళేశ్వరం పేరుతో దక్షిణ తెలంగాణని ఎందుకు పక్కన పెట్టారు. కేసీఆర్ బాపు కాదు. రజతోత్సవంలో ప్రజలకు ఆయన క్షమాపణ చెప్పాలి. కేసీఆర్ దోచుకున్నది అందరికీ తెలుసు. కేసీఆర్..రజతోత్సవంలో బీసీని అధ్యక్షుని చేస్తారని సమాచారం ఉంది. మేము ఆహ్వానిస్తున్నాం. కాంగ్రెస్ చేసిన కులగణన వల్ల బీఆర్ఎస్ పార్టీకి బీసీ అధ్యక్షుని ఆలోచన వచ్చిందని ఎంపీ చామల రైతు మహోత్సవం కార్యక్రమంలో చెప్పారు.

# భూభారతి చట్టంతో రైతుల సమస్యలు పరిష్కారం...



**ప్రజాదీవెన, బొమ్మల రామారం :** భూభారతి చట్టం తో ఎంతోకాలంగా ఇబ్బందులు పడుతున్న సమస్యలకు చక్కని పరిష్కార మార్గం లభించిందని ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య తెలిపారు. సోమవారం బొమ్మల రామారం, రాజ పేట మండలాలలో పర్యటించి ఏర్పాటు చేసిన భూ భారతి అవగాహన సదస్సు లలో పాల్గొన్నారు. బొమ్మల రామారం మండల కేంద్రంలోని రెవెన్యూశాఖ అధ్వర్యంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరా రెడ్డి తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన భూభారతి ఆర్ ఓ ఆర్ చట్టం అవగాహన సదస్సు లో జిల్లా కలెక్టర్ హనుమంతరావు తో కలిసి ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ , ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్య మాట్లాడుతూ.... భూమి ఉన్న ప్రతి ఒక్కరికి హక్కు కల్పించాలని గొప్పఉద్దేశంతో ప్రభుత్వం భూభారతి చట్టం తీసుకొచ్చిందన్నారు ఈ చట్టం గ్రామాలలో విస్తృత ప్రచారం చేపట్టి అవగాహన కల్పిస్తున్నామన్నారు. గతంలో భూమి సమస్యలు అధికంగా ఉండేవని, సమస్యలు పరిష్కారం కాక కోర్టుల చుట్టూ తిరిగి డబ్బుతో పాటు సమయం వృధా అయ్యేదన్నారు. భూభారతి తో ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా పేరుకుపోయిన పలు సమస్యలకు పరిష్కారం చూపాలని, నిజమైన రైతుకు మేలు చేసే విధంగా ప్రభుత్వం ఆలోచన చేసిందన్నారు. భూభారతి ద్వారా నేడు సమస్యలకు పరిష్కారం లభించనున్నదన్నారు.

అవగాహన పొందిన వారు మీ గ్రామాలలో రైతులకు అవగాహన కల్పించి భూ సమస్యలు సులభతరంగా పరిష్కరించుకునే విధంగా కృషి చేయాలన్నారు. రైతులకు ప్రభుత్వం భూ భారతి చట్టంతో పెద్ద పీత వేసిందన్నారు. రైతుల భూ సమస్యలు మార్పులు చేర్పులు, మ్యుటేషన్, ఇతర సమస్యలకు ఈ భూభారతి చట్టం ఉపయోగపడుతుందన్నారు. భూ సమస్య లేని గ్రామాలు ఇకపై ఉండవన్నారు. భూమి పై యజమాన్యుడికి సర్వహక్కులు భూభారతి చట్టం కల్పించనున్నదన్నారు. ముఖ్యమంత్రి సుదీర్ఘంగా దృఢమైన ఆలోచన చేసి ఈ చట్టాన్ని తీసుకొచ్చినందుకు రుణపడి ఉంటామన్నారు. ప్రతి మనిషికి ఆధార్ మాదిరిగానే భూమి ఉన్న ప్రతి ఒక్కరికి భూధర్ కార్డులు ప్రభుత్వం అందిస్తుందన్నారు.

జిల్లా కలెక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ... భూ సమస్య పై ఒక వ్యక్తి చేసుకున్న దరఖాస్తు దానిలో కబ్జా జరిగినా, పట్టా ఇతరుల పేరు మీద నమోదు అయినా, దాన్ని పరిష్కారం కు గతంలో ధరణి లో లేనందున కోర్టుకు పంపడం జరిగేదన్నారు. అక్కడ కూడా కొన్ని సమస్యలు రకరకాల సమస్యలతో పరిష్కారం కాకపోయేవని, ఇప్పుడు భూభారతి చట్టం ద్వారా ఇబ్బందులు పోతాయన్నారు. ఇకనుండి ప్రతి డిసెంబర్ మాసంలో రెవెన్యూ రికార్డుల లో నమోదు చేయడం జరుగుతుందన్నారు. సెక్షన్ 12 ప్రకారంగా పహాని పొందవచ్చని, సెక్షన్ 4 ప్రకారం తప్పులు సరిదిద్దడం జరుగుతుందన్నారు. భూభారతి అప్పిలేట్ అధికారిగా ఆర్డీఓ ఉంటారని, ఏమైనా భూ సమస్యల పై అన్యాయం జరిగితే ఆర్డిఓ సవరించి చట్టం ద్వారా న్యాయం జరిగేలా చేస్తారన్నారు. భూభారతి రైతులకే ధైర్యం కాదని అధికారులకు కూడా భూ సమస్య పరిష్కరమయినందుకు సంతృప్తి కలుగుతుందన్నారు. ప్రజలు భూ సమస్యల వల్ల కార్యాలయాలు,అధికారుల చుట్టూ తిరగకుండా ఏమైనా భూ సమస్య ఉంటే ఇకనుండి సులభతరంగా పరిష్కరించుకోవచ్చని , స్థానిక తహసిల్దార్ పరిధిలో కాకపోతే ఆర్డీవో పరిధిలో పరిష్కారం జరుగుతుందని, ఆర్డీవో పరిధిలో కూడా పరిష్కారం కాకపోతే కలెక్టర్ స్థాయిలో పరిష్కరిస్తారని, కలెక్టర్ స్థాయి లో కూడా కాకపోతే సీసీఎల్ఏ ద్వారా పరిష్కారం అవుతుందన్నారు. భూభారత్ చట్టం అప్పీల్ ను తీసుకురావడం ద్వారా పేదలకు తప్పనిసరిగా న్యాయం జరుగుతుందన్నారు. నిజమైన నిరుపేదల అన్ని రకాల భూ సమస్యలకు భూ భారతి చట్టం శాశ్వత పరిష్కారం చూపుతుందన్నారు. ఈ అవగాహన సదస్సులో భువనగిరి ఆర్డీవో కృష్ణారెడ్డి, బొమ్మల రామారం, రాజాపేట తహసిల్దార్లు శ్రీనివాసరావు,అనిత, ఎంపీడీఓలు త్రివిక్రమ్, నాగ వాణి , ప్రత్యేక అధికారులు జ్యోతి కుమారి, శాంత కుమారి, అధికారులు, ప్రజా ప్రతినిధులు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.



# గిల్, సుదర్శన్ విజృంభణ
# జీటీ గెలుపు జోరు..

**కోల్‌కతాపై ఘన విజయం**
**గుజరాత్ బౌలర్ల సమిష్టి ప్రదర్శన**

కోల్‌కతా: ఐపీఎల్‌లో డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్ ప్రయాణం పడుతూ లేస్తూ సాగుతున్నది. ఒక మ్యాచ్ గెలుస్తూ, మరో మ్యాచ్‌లో ఓడుతున్న కోల్‌కతా మళ్లీ అదే పంథాను అనుసరించింది. సొంత ఇలాఖాలో కోల్‌కతాకు మరోమారు చుక్కెదురైంది. సోమవారం ఈడెన్‌గార్డెన్స్‌లో జరిగిన పోరులో గుజరాత్ టైటాన్స్(జీటీ) 39 పరుగుల తేడాతో కోల్‌కతాపై ఘన విజయం సాధించింది. తొలుత కెప్టెన్ శుభ్‌మన్ గిల్(55 బంతుల్లో 90, 10ఫోర్లు, 3సిక్స్‌లు) ధనాధన్ అర్ధసెంచరీకి తోడు సాయి సుదర్శన్(36 బంతుల్లో 52, 6ఫోర్లు, సిక్స్) సమయోచిత ఇన్నింగ్స్‌తో గుజరాత్ 20 ఓవర్లలో 198/3 స్కోరు చేసింది. వీరిద్దరు తొలి వికెట్‌కు 114 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పారు.

అరోరా, రానా, రస్సెల్ ఒక్కో వికెట్ తీశారు. లక్ష్యఛేదనలో కోల్‌కతా 20 ఓవర్లలో 159/8 స్కోరు చేసింది. కెప్టెన్ రహానే(50) అర్ధసెంచరీ మినహా అందరూ ఘోరంగా విఫలమయ్యారు. ప్రసిద్ధ్ కృష్ణ, రషీద్‌ఖాన్ రెండేసి వికెట్లతో కోల్‌కతా పతనంలో కీలకమయ్యారు. గిల్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.




**గిల్, సుదర్శన్ ధనాధన్:**

టాస్ గెలిచిన కోల్‌కతా కెప్టెన్ రహానే బౌలింగ్ ఎంచుకున్నాడు. తాను తీసుకున్న నిర్ణయం తప్పని తెలుసుకోవడానికి రహానేకు పెద్దగా సమయం పట్టలేదు. బ్యాటింగ్‌కు బాగా అనుకూలిస్తున్న పిచ్‌పై గుజరాత్ ఓపెనర్లు గిల్, సుదర్శన్ అదిరిపోయే ఆరంభాన్ని ఇచ్చారు. కోల్‌కతా బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ ఈ ద్వయం బౌండరీలతో విజృంభించారు. ఆరోరా మూడో ఓవర్‌లో సుదర్శన్ రెండు ఫోర్లతో చెలరేగగా, మరోవైపు తానేం తక్కువ కాదన్నట్లు గిల్ కూడా చెలరేగాడు.

రానాను లక్ష్యంగా చేసుకుంటూ ఐదో ఓవర్‌లో వరుసగా రెండు ఫోర్లతో ఇన్నింగ్స్‌కు ఊపు తీసుకొచ్చాడు. దీంతో పవర్‌ప్లే ముగిసేసరికి గుజరాత్ వికెట్ కోల్పోకుండా 45 పరుగులు చేసింది. ఎక్కడా జోరు తగ్గించని గిల్..అలీ వేసిన 7వ ఓవర్‌లో వరుసగా 6,4, 4 బాదడంతో 17 పరుగులు వచ్చి చేరాయి. బౌలింగ్ మార్పుగా వచ్చిన మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తిని గిల్, సుదర్శన్ విడిచిపెట్టలేదు. ఈ క్రమంలో ఇద్దరు పోటాపోటీగా పరుగులు సాధించే ప్రయత్నం చేశారు.

బంతి తేడాతో గిల్, సుదర్శన్ అర్ధసెంచరీ మార్క్ అందుకున్నారు. ఇన్నింగ్స్ దూసుకెళుతున్న తరుణంలో సుదర్శన్‌ను రస్సెల్ ఔట్ చేసి కోల్‌కతాకు బ్రేక్ ఇచ్చాడు. దీంతో తొలి వికెట్‌కు 114 పరుగుల పార్ట్‌నర్‌షిప్‌నకు బ్రేక్‌పడింది. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన బట్లర్(41 నాటౌట్)..గిల్‌కు జతకలిశాడు. బట్లర్‌ను అండగా చేసుకుంటూ గిల్ మరింత చెలరేగాడు. దీంతో గుజరాత్ ఇన్నింగ్స్ ఊపందుకుంది. 18వ ఓవర్‌లో గిల్ ఔట్ కావడం, ఆ వెంటనే రాహుల్ తెవాటియా(0)కూడా పెవిలియన్ చేరారు. ఆఖర్లో బట్లర్, షారుఖ్‌ఖాన్(11 నాటౌట్) బ్యాట్లు ఝులిపించడంలో విఫలం కావడంతో ఆఖరి 5 ఓవర్లలో గుజరాత్ 59 పరుగులకే పరిమితమైంది.

**కోల్‌కతా ఢమాల్:**

నిర్దేశిత లక్ష్యఛేదనలో కోల్‌కతా వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయింది. ఈ సీజన్‌లో తొలి మ్యాచ్ ఆడుతున్న వికెట్‌కీపర్, బ్యాటర్ గుర్బాజ్( 1) ఘోరంగా విఫలం కాగా, నరైన్ (17), వెంకటేశ్ (14), రింకూసింగ్ (17), రస్సెల్ (21), రమణ్‌దీప్‌సింగ్(1), అలీ(0) తీవ్రంగా నిరాశపరిచారు. చెత్త షాట్లకు పోయిన కోల్‌కతా బ్యాటర్లు మూ ల్యం చెల్లించుకున్నారు. వచ్చిన బ్యాటర్లు వచ్చినట్లు పెవిలియన్‌కు క్యూ కట్టడంతో సాధించాల్సిన రన్‌రేట్ అంతకంతకూ పెరుగుతూ పోయింది. ఇదే అదనుగా గుజరాత్ బౌలర్లు ఒత్తిడి పెంచడంతో కోల్‌కతా బ్యాటర్లు నిలదొక్కుకోలేకపోయారు. ఆఖర్లో రఘువంశీ(27 నాటౌట్) ఒంటరి పోరాటం జట్టును గెలిపించలేకపోయింది.

**సంక్షిప్త స్కోర్లు**

గుజరాత్: 20 ఓవర్లలో 198/3(గిల్ 90, సుదర్శన్ 52, రస్సెల్ 1/13, అరోరా 1/44), కోల్‌కతా: 20 ఓవర్లలో 159/8(రహానే 55, రఘువంశీ 27 నాటౌ, ప్రసిద్ధ్ 2/25, రషీద్ 2/25)

## శాంసన్‌కు గాయం

జైపూర్: ఐపీఎల్‌లో వరుస ఓటములతో సతమతమవుతున్న రాజస్థాన్ రాయల్స్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. రెగ్యులర్ కెప్టెన్ సంజూ శాంసన్ మళ్లీ గాయపడ్డాడు. ఢిల్లీతో మ్యాచ్ సందర్భంగా పక్కటెముకల నొప్పితో ఇబ్బందిపడ్డ శాంసన్ ఇంకా పూర్తిగా కోలుకోలేదు.



సొంత ఇలాఖాలో లక్నోతో మ్యాచ్‌కు దూరమైన శాంసన్ గురువారం ఆర్‌సీబీతో మ్యాచ్‌కు కూడా అందుబాటులో ఉండటం లేదు. ఈ విషయాన్ని రాజస్థాన్ ఫ్రాంచైజీ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది. అయితే శాంసన్ కోలుకుని జట్టులోకి తిరిగి ఎప్పుడు వస్తాడన్న దానిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.

## సిమ్రన్‌ప్రీత్‌కు రజతం

**ఐఎస్ఎస్ఎఫ్ షూటింగ్ ప్రపంచకప్**

లిమా (పెరూ): ప్రతిష్ఠాత్మక ఐఎస్ఎస్ఎఫ్ షూటింగ్ ప్రపంచకప్‌లో భారత యువ షూటర్ సిమ్రన్‌ప్రీత్ కౌర్ రజత పతకంతో మెరిసింది. సోమవారం జరిగిన మహిళల 25 మీటర్ల పిస్టల్ ఫైనల్లో సిమ్రన్‌ప్రీత్ కౌర్ 33 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. సున్ యుజి (34, చైనా), యావో జియాన్‌జున్ (29, చైనా) వరుసగా స్వర్ణ, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు.



ఇదే విభాగంలో పోటీపడ్డ మను భాకర్ (22), ఇషాసింగ్ (17) వరుసగా నాలుగు, ఆరు స్థానాల్లో నిలిచి నిరాశపరిచారు. మరోవైపు 10మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్‌ఈవెంట్‌లో రుద్రాంక్ష్, ఆర్య జోడీ రజతం ఖాతాలో వేసుకుంది. హొరాహోరీగా సాగిన ఫైనల్లో భారత ద్వయం 11-17తో నార్వే జోడీ చేతిలో ఓటమిపాలైంది.

## టాప్ గ్రేడ్‌లో 'రోకో'




**శ్రేయాస్, ఇషాన్‌కు మళ్లీ కాంట్రాక్టు**
**గ్రేడ్-ఏలోనే సిరాజ్ కొత్తగా**
**నితీశ్ సహా ఐదుగురికి చోటు**
**బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్టులు ఖరారు**

న్యూఢిల్లీ: భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) వార్షిక కాంట్రాక్టులను ఖరారు చేసింది. మొత్తం 34 మంది క్రికెటర్లతో సోమవారం జాబితాను విడుదల చేసింది. అక్టోబర్ 1, 2024 నుంచి సెప్టెంబర్ 30, 2025 వరకు గాను బోర్డు క్రికెటర్లను ఎంపిక చేసింది. టీమ్‌ఇండియా స్టార్ క్రికెటర్లు 'రోకో' జోడీగా పిలుచుకునే రోహిత్‌శర్మ, విరాట్‌కోహ్లీ టాప్‌గ్రేడ్ అయిన 'ఏం'లో చోటు నిలుపుకున్నారు. ఇప్పటికే అంతర్జాతీయ టీ20లకు వీడ్కోలు పలికిన రోహిత్, కోహ్లీ..వన్డే, టెస్టుల్లో కొనసాగుతున్నారు. ఈ జాబితాలో వీరిద్దరితో పాటు బుమ్రా, జడేజా అత్యధికంగా 7 కోట్ల వేతనం అందుకోనున్నారు. దేశవాళీ క్రికెట్ ఆడలేదన్న కారణంతో బోర్డు ఆగ్రహానికి గురైన శ్రేయాస్ అయ్యర్, ఇషాన్‌కిషన్ తిరిగి కాంట్రాక్టులు దక్కించుకున్నారు.

హైదరాబాదీ స్పీడ్‌స్టర్ మహమ్మద్ సిరాజ్ గ్రేడ్-ఏలో చోటు నిలబెట్టుకున్నాడు. తన ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొడుతున్న ఏపీ క్రికెటర్ నితీశ్‌కుమార్‌రెడ్డి, హర్షిత్ రానా సహా ఐదుగురికి కొత్తగా కాంట్రాక్టు దక్కింది. వార్షిక కాంట్రాక్టుల్లో ఏం గ్రేడ్ క్రికెటర్లకు ఏడాదికి రూ. 7 కోట్లు, ఏ విభాగానికి రూ. 5 కోట్లు, బీ, సీ కేటగిరీల్లో వరుసగా రూ. 3 కోట్లు, కోటి రూపాయలు దక్కనున్నాయి.

ఐపీఎల్‌లో తమ తమ ఫ్రాంచైజీల తరఫున అర్ధసెంచరీలతో రాణించిన మరుసటి రోజే విరాట్, రోహిత్ టాప్ గ్రేడ్‌లో చోటు నిలుపుకున్నారు. అయితే రానున్న ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్ ఆధారంగా రోహిత్‌శర్మ కెప్టెన్సీపై స్పష్టత రానుంది. రోహిత్ కెప్టెన్‌గా కొనసాగుతాడా లేదా అన్నది చీఫ్ కోచ్ గౌతం గంభీర్ నిర్ణయంపై ఆధారపడనుంది. ఇదిలా ఉంటే సీనియర్ ఆల్‌రౌండర్ శార్దూల్ ఠాకూర్‌తో పాటు అవేశ్‌ఖాన్, కేఎస్ భరత్, జితేశ్‌శర్మను బీసీసీఐ కాంట్రాక్టు జాబితా నుంచి తప్పించింది.

# కర్నాటకలో ప్రత్యక్షమైన ఎన్టీఆర్

## ప్రశాంత్ నీల్ సినిమా కోసం వచ్చినట్లు సమాచారం



యంగ్ టైగర్ ఎన్టీఆర్ సినిమాల కోసం అభిమానులు ఎంత ఆసక్తిగా ఎదురు చూస్తుంటారో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఆర్ఆర్ఆర్ సినిమాతో పాన్ ఇండియా స్టార్ హీరోగా పేరు ప్రఖ్యాతలు అందిపుచ్చుకున్న ఎన్టీఆర్ ఆ తర్వాత వచ్చిన దేవర చిత్రంతో ఫుల్ క్రేజ్ సంపాదించుకున్నాడు. దేవర తర్వాత ఎన్టీఆర్ ఏ హీరోతో సినిమా చేయనున్నాడు, షూటింగ్ ఎప్పుడు మొదలు పెడతాడు, ఎప్పుడు పూర్తి చేస్తాడు అనే అనుమానాలు అందరిలో ఉన్నాయి. ఇప్పుడు అభిమానుల ఆనందాన్ని రెట్టింపు చేసేందుకు యంగ్ -టైగర్ ఏప్రిల్ 22 నుంచి కర్ణాటకలో జరగనున్న షూటింగ్ లో పాల్గొననున్నాడు. ఎన్టీఆర్ హైదరాబాద్ ను వదిలి కర్ణాటకకు వెళ్లాడు. ర్ణాటక వెళ్తూ ఎయిర్‌పోర్టులో తన నిర్మాతలతో మాట్లాడుతూ కనిపించాడు. ఆ సమయంలో ఎన్టీఆర్‌ని తమ కెమెరాలలో బంధించారు. ఎన్టీఆర్ లుక్ అయితే ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. గతంలో ఎన్నడు లేనంత సన్నగా, స్టైలిష్‌గా కనిపిస్తున్నాడు. జాకెట్ లాంటి షర్ట్, కళ్లకు అద్దాలు పెట్టు-కుని తన లుక్‌తో ఆకట్టుకున్నాడు ఎన్టీఆర్. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా ఎన్టీఆర్- ప్రశాంత్ నీల్ చిత్రం తెరకెక్కుతుండగా, ఈ సినిమాలో ఎన్టీఆర్‌ను నీల్ చాలా కొత్తగా ప్రెజెంట్ చేయాలని చూస్తున్నట్టు- తెలుస్తోంది. భారీ అంచనాలతో రూపొందుతున్న ఈ సినిమా ఆడియన్స్ కు నెక్స్ట్ లెవెల్ ఎక్స్‌పీరియెన్స్ ఇస్తుందని చిత్ర యూనిట్ చెప్తోంది. ఇటీ-వల ఈ హై ఓల్టేజ్ యాక్షన్ మూవీ చిత్రీకరణ హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీ-లో మొదలైంది. ఈ క్రేజీ మూవీ సెట్స్‌లోకి ఎన్టీఆర్ ఎప్పుడెప్పుడు అడుగు పెడతాడా అని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇప్పుడు ఆ సమయం వచ్చేసింది. ఎన్టీఆర్ సెట్స్‌లో అడుగుపెట్టబోతున్న నేపథ్యంలో చిత్ర యూనిట్ సోషల్ మీడియాలో ఓ పోస్ట్ చేస్తూ.. మారణహోమానికి ముందు ప్రశాంతత.. అంటూ ఎన్టీఆర్ షూటింగ్ కోసం స్టార్ట్ అయిన వీడియోను షేర్ చేసింది. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్లలో నవీన్ యెర్నేని, రవిశంకర్, నందమూరి కళ్యాణ్ రామ్ ఈ సినిమాను సంయుక్తంగా నిర్మిస్తున్నారు. బ్లాక్ బస్టర్ హిట్స్‌ను తెరకెక్కించిన ప్రశాంత్ నీల్ యూనిక్ మాస్ విజన్‌తో ఎన్టీఆర్‌ను సరికొత్త మాస్ అవతార్‌లో చూపించబోతున్నారు. ఇది సినీ ఇండస్ట్రీలో సరికొత్త మైలురాయిని సృష్టించనుందని అంటున్నారు.

# పిల్లల కోసమే నటనకు దూరంగా ఉన్నా..

## అలనాటి నటి రంభ మనసులో మాట



అలనాటి హీరోయిన నటి రంభ సినిమాలకు దూరమై 15 ఏళ్లు గడిచాయి. ప్రస్తుతం ఓ టీవీ రియాలిటీ షోకు న్యాయ నిర్ణేతగా వ్యవహరిస్తున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆమె పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. పిల్లల కోసం ఇంతకాలం పరిశ్రమకు దూరంగా ఉండాల్సి వచ్చిందని అన్నారు. వివాహం అనంతరం కెనడాలో స్థిరపడినట్లు వెల్లడించారు. ఇప్పుడు మళ్లీ తెరపై కనిపించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు- తెలిపారు. నా పిల్లలకు ఒక వయసు వచ్చేవరకూ తల్లిగా పూర్తి బాధ్యత తీసుకున్నాను. వారిని దగ్గరుండి చూసుకున్నాను. ఇప్పుడు మా బాబుకు 6 ఏళ్లు. కుమార్తెలకు 14, 10 ఏళ్లు. వాళ్లు ఇప్పుడు ఎవరిపైనా ఆధారపడకుండా పనులు చేసుకుంటున్నారు. వాళ్లను చూసుకోవడం కోసమే నేను ఇన్నేళ్లు సినిమాలకు దూరమయ్యాను. కానీ, నాకు సినిమాలపై ఉన్న ఆసక్తి నా భర్తకు తెలుసు. ఆయన ప్రోత్సాహంతోనే ఈ షోకు న్యాయనిర్ణేతగా వ్యవహరించేందుకు అంగీకరించానని వివరించారు. మొదటిసారి ఇండస్ట్రీకి వచ్చినప్పుడు ఎలా భయపడ్డానో ఇటీవల ఈ కార్యక్రమం కోసం డ్యాన్స్ వేసినప్పుడు అంతే భయపడ్డాను. వ్యాన్‌లో నుంచి కిందకు రావడానికి కూడా సంకోచించాను. కానీ, ఒక్కసారి స్టేజ్ మీద డ్యాన్స్ వేశాక అందరి చప్పట్లు నాలో భయాన్ని పోగొట్టాయి. 30 ఏళ్ల క్రితం మేజిక్ మరోసారి రిపీట్ అయిందన్నారు. ఇటీవల ఒక ప్రారంభోత్సవానికి వచ్చాను. అక్కడి జనాలు నాపై ఎంతో ఆదరణ చూపారు. వారు నన్ను ఆదరించిన తీరు చూసిన తర్వాత నాకు సినిమాలపై మరోసారి ఆసక్తి కలిగింది. 15 ఏళ్లు దూరమైనప్పటికీ నటన నా రక్తంలోనే ఉంది. నాతో పాటు ఇండస్ట్రీకి వచ్చిన ఎంతోమంది నేటికీ నటిస్తూనే ఉన్నారు. అందుకే నేను కూడా మరోసారి వెండితెరపై కనిపించాలని నిర్ణయించుకున్నానని నటిరంభ వివరించారు.



# రామ్ తో భాగ్యశ్రీ.. రింగ్ కామెంట్ తో క్లారిటీ!

టాలీవుడ్ ఎనర్జిటిక్ స్టార్ రామ్, హీరోయిన్ భాగ్యశ్రీ బొర్సే రిలేషన్ లో ఉన్నట్టు కొద్ది రోజులుగా రూమర్స్ చక్కర్లు కొడుతున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం వీరిద్దరూ ఓ మూవీ చేస్తున్నారు. ఆ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తాజాగా ఇద్దరూ.. తమ సోషల్ మీడియా అకౌంట్స్ లో వేర్వేరుగా ఫోటోలు షేర్ చేసుకున్నారు. కానీ రెండు ఫోటోల్లో బ్యాక్ గ్రౌండ్ ఒకేలా ఉ ఒడడంతో కొందరు అతిగా కామెంట్స్ పెట్టారు. అయితే షూటింగ్ జరుగుతున్న సమయంలో హీరోహీరోయిన్లు.. ఒకే హొటల్ లో స్టే చేయడం కామన్. హొటల్ కాబట్టి రూమ్స్ ఒకేలా ఉంటాయి. అందుకే రామ్, భాగ్యశ్రీ పిక్స్ లో బ్యాక్ గ్రౌండ్ ఒకేలా ఉంది. దానికే డేటింగ్ అంటూ రూమర్స్ స్ప్రెడ్ చేశారు. అదే సమయంలో మరో నెటిజన్ భాగ్యశ్రీ పిక్ కు.. మీ హ్యాండ్ కు ఉన్న రింగ్ ఎవరు తొడిగారని క్వశ్చన్ చేశాడు. దీంతో భాగ్యశ్రీ సరైన విధంగా రెస్పాండ్ అయింది. ఆ రింగ్ తానే కొనుకున్నానని తెలిపింది. దీంతో తాను ఎవరితో రిలేషన్ లో లేనని పరోక్షంగా క్లారిటీ ఇచ్చింది. అలా రామ్ తో డేటింగ్ చేస్తున్నట్లు వస్తున్న వార్తలకు చెక్ పెట్టింది అమ్మడు. ప్రస్తుతం మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి మూవీతో మంచి హిట్ అందుకున్న పి. మహేష్ బాబు దర్శకత్వంలో రామ్, భాగ్యశ్రీ సినిమా చేస్తున్నారు. అందులో రామ్ సాగర్ గా.. భాగ్యశ్రీ మహాలక్ష్మిగా సందడి చేయనున్నారు. ఇప్పటికే వారి ఫస్ట్ లుక్స్ ను మేకర్స్ రిలీజ్ చేయగా.. అదిరిపోయే రెస్పాన్స్ వచ్చింది. మూవీపై పాజిటివ్ బజ్ కూడా క్రియేట్ అయింది.



# ఏంటి సమంతలో ఈ టాలెంట్ కూడా ఉందా..?

సౌత్ స్టార్ హీరోయిన్ గా సమంత మొన్నటిదాకా టాప్ ప్లేస్ లో ఉన్నది. ఐతే ఆమె లైఫ్ లో జరిగిన కొన్ని విషయాల వల్ల అటు పర్సనల్ లైఫ్ ఇటు ప్రొఫెషనల్ లైఫ్ రెండిటిలో చాలా డిస్టర్బ్ అయ్యింది. ఐతే మళ్లీ తనను తాను ప్రూవ్ చేసుకునేందుకు తిరిగి ప్రయత్నిస్తుంది సమంత. ఈ క్రమంలో బాలీవుడ్ లో వెబ్ సిరీస్ లు చేస్తూ వస్తుంది. ఐతే సమంత కొత్తగా ప్రొడక్షన్ లోకి దిగింది. ట్రాలాలా బ్యానర్ లో శుభం అనే సినిమా మొదలు పెట్టింది. కొత్త టాలెంట్ ని ఎంకరేజ్ చేస్తూ సమంత చేస్తున్న ఈ ప్రయత్నం వర్క్ అవుట్ అవుతుందా లేదా అన్నది చూడాలి. ప్రవీణ్ కంద్రేగుల డైరెక్షన్ లో తెరకెక్కిన శుభం సినిమా కంప్లీట్ ఎంటర్టైనర్ గా రాబోతుంది. ఐతే సినిమా రైటింగ్ లో కూడా సమంత హ్యాండ్ ఉన్నట్టు తెలుస్తుంది. నటిగా ఇన్నేళ్ల అనుభవం ఉన్న ఆమె ఒక కథను ఎలా తీస్తే ప్రేక్షకుల మెప్పు పొందే ఛాన్స్ ఉంటుంది. ఇక తన ప్రొడక్షన్ లో సినిమా కాబట్టి స్క్రిప్ట్ విషయంలో తనకు తోచిన సలహాలు కూడా ఇచ్చిందట అమ్మడు. ఐతే సమంత కథలో ఇన్వాల్వ్ అవ్వడం గురించి తెలుసుకున్న ఆమె ఫ్యాన్స్ అమ్మడిలో ఈ టాలెంట్ కూడా ఉందా అని ఆశ్చర్యపోతున్నారు. ఐతే సొంత బ్యానర్ లో సినిమా కాబట్టి మొదటి సినిమా సక్సెస్ చేసుకునే క్రమంలో సమంత తనలో ఉన్న అన్ని టాలెంట్ లను బయటకు తీసిందని తెలుస్తుంది.

# అవమానంతో అద్దానికి దూరంగా ఆరు నెలలు!



బాలీవుడ్ నటి విద్యాబాలన్ కాస్టింగ్ కౌచ్ పై గతంలో ఎంతో ఓపెన్ గా మాట్లాడింది. ఇండస్ట్రీలో అవకాశం పేరుతో లైంగికంగా ఎలాంటి వేధింపులు ఎదు-ర్కోవాల్సి ఉంటుందన్నది చెప్పిన సందర్భాలెన్నో. లైంగిక వేధింపుల నుంచి తానెలా తప్పించుకుందో చెప్పింది. అలాంటి వాళ్ల విషయంలో ఎంత జాగ్రత్తగా వ్యవహరించాలన్నది కొత్తగా ఇండస్ట్రీకి వచ్చే యువతకు సూచించింది. ఈ నేపథ్యంలో తాజాగా మరోసారి కాస్టింగ్ కౌచ్ పై గళం విప్పింది. %-%ఓ సినిమా నిర్మాత నాతో దారుణంగా ప్రవర్తించాడు. నేరుగా నా దగ్గరకు వచ్చి అసభ్యంగా పిలిచాడు. ఆ అవమానం తర్వాత ఆరు నెలలు పాటు అద్దంలో ముఖం చూసుకోవడం మానేసాను. ఆ మాటల తర్వాత నాపై నేను నమ్మకం కూడా కోల్పోయాను. ఇలాంటి సంఘటనలు ఎన్నో జరిగాయి. అదే సమయంలో బాడీ షేమింగ్ చేసేవారు. మలయాళంలో నటించే అవకాశం వచ్చింది. కానీ ఆ సినిమా ప్రారంభానికి ముందే ఆగిపోయింది. అప్పుడు నన్నతంతా దురదృష్టవంతురాలన్నారు. సినిమా ఏదో కారణంతో ఆగిపోతే అంతా నన్నే ఆడిపో సుకున్నారు. నా కారణంగా నిలిచిపోయిందన్నట్లు ప్రచారం చేసారు. ఇలాంటివి నా జీవితంలో చాలా ఉన్నాయని%-% వాపోయింది. బాలీవుడ్ పై కాస్టింగ్ కౌచ్ అరోపణలు కొత్తేం కాదు. ఇప్పటికే చాలా మంది హీరోయిన్లు పరిశ్రమపై ఆరోపణలు చేసారు. ఐశ్వర్యారాయ్, దీపికా పదుకొణే నుంచి చాలా మంది యువ భామలు తమ అనుభవాల్ని చెప్పుకొచ్చారు. విద్యాబాలన్ సినిమా ప్రేక్షకుల ముందుకొచ్చి నెలలు గడుస్తుంది. గత ఏడాది రెండు సినిమాలతో ప్రేక్షకుల ముందుకొచ్చింది. కానీ కొత్త ఏడాది లో మాత్రం %-%డర్టీ భామ%-% ఒక్క అనౌన్స్ మెంట్ కూడా చేయలేదు.

Printed, Published and Owned by : GUNDAGONI LINGAIAH and Printed at MANASA PRINTERS, H.No. 7-848/3,Srinagar Colony,Panagal Road,Nalgonda-508001 . and Published at Manasa Publication H.No. 7-848/3,Srinagar Colony,Panagal Road,Nalgonda-508001. Editor: GUNDAGONI LINGAIAH RNI.No. TELTEL/2013/58044. Cell : 9848457689. gundagoni@gmail.com CEO: KANDHULA VENKATARAMANA